నేటి నిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 27-11-2025

## నానీలు

రైతు చేతిలో
పురుగుల మందు
పైరు కోసమా?
ఆత్మహత్యకోసమా?

ఇంకా
కల్తీకానిది
పున్నమి వెన్నెలవంటి
పాపాయి నవ్వు.

-పాతూరి అన్నపూర్ణ

మనసున్నవాడే
శ్రీమంతుడు
ఉన్నంతలో ఎంతో కొంత
సాయం చేస్తాడు!

ఆప్యాయతా అనురాగాలు
ఆవిరి..
నోట్ల పరవశం లో
ప్రపంచముంది మరి!

-ఎస్. ఎం. సుభాని
9490776184

## నానీలు

డబ్బవసరం
ఎంతటిదో?
ఇంటినే కాదు
గర్భసంచినీ బాడుక్కే.

రైతు ఇంటికి
కన్నం వేసా
నాకు చాలానే దొరికాయి
దుఃఖాలు..నిట్టూర్పులు.

పిల్లలకు
అమ్మ పైటే చాటు
పెద్దయ్యాక ఆమెకు
వాళ్ళ చూపే చాటు.

నేను
ఎప్పటికీ ధనవంతుణ్ణి
తృప్తి
నా ధాన్యాగారం కదా!

తల్లినైనప్పుడల్లా
పునర్జన్మించా
వాళ్ళైదిగాక
మళ్ళీ మళ్ళీ మరణించా

పెద్దల మాట
అనుభవాల పాట
వినకపోతే
ఊబి ఊట.

-జయప్రద పెళ్ళకూరు
సెల్:9440279594

## సప్త పదులు

మరుపు
విరుపు

తగ్గించుకోకుంటే
సంబంధాలలో
రాక తప్పదు
చెరుపు

-దోర్బల మంజులత
9390411600

బంధాలు.
అనుబంధాలు.

మాయమైపోతున్నాయి
నేటి సమాజంలో
రక్త
సంబంధాలు.

-సంకా శోభారాణి.
9703858539.

మొగులు
బుగులు

అతివృష్టితో
రైతులపంటలకు
తగులుతుంది
ఒకటే తెగులు!

-డా.గన్నోజుశ్రీనివాసాచారి
9490145913

కలిగించుకోవాలి
అనిపించుకోవాలి.

ఎల్లప్పుడూ కలిసుండాలంటే
మనసులో
అభిప్రాయభేదాలను
తొలగించుకోవాలి.

-జవ్వాది సూర్యారావు,
6372770071.

పుస్తకాలు.
మస్తకాలు.

విజ్ఞాన
నిధులు.
చరిత్రను తెలిపే
జ్ఞానదీపికలు.

-సంకా శోభారాణి.
903858539.

ప్రతాపము
పరితాపము

అడవులను
నరికి పెంచాము
మనం
భూతాపము

-యం.నాగేశ్వరమ్మ
8179950667

## నానీలు

నాయనమ్మ వైద్యం
అనుభవ ధైర్యం
చేతికర్ర లాంటి
పెద్దరికం ఊతం!.

కుప్ప కూలింది
భావపురి గుడి గోపురమా?
ఈ ఊరి
ప్రతిష్ట కూడా!

అమ్మ దస్తూరి
దాచుకున్నజడి
రెక్కలు కట్టుకు
వాలాలని అలజడి !.

నాన్న ఆమ్రతరువుకు
త్యాగ ఫలాలు
ఫలాల ముందు
త్యాగానికి విలువేది?.

రైలు ఆలస్యం
ప్లాట్ ఫారమే మంచం
నేను రైలెక్కేదాకా
నాన్నకునుకు దూరం !.

నా చేతుల్లోనే
నాన్న ఊపిరి ఆగింది
కాలం గడ్డకట్టి
కన్నీరై జారింది!

న్యాయ పోరాటం
అంకెలకు లోకదీపం
పద్య ప్రియత్వం
నాన్నే నడిచే గాయం!



-డా. సి. భవానీదేవి
9866847000

## సప్త పదులు

మరుపు
విరుపు

తగ్గించుకోకుంటే
సంబంధాలలో రాక
తప్పదు
చెరుపు

-దోర్బల మంజులత
9390411600

పిలుద్దాం
కలుద్దాం

బాంధవ్యాలను పెంచుకొని
అందరి మనసులను
గెలుద్దాం

-తిప్పావఝుల నరసింహమూర్తి
9440734907

బంధాలు.
అనుబంధాలు.

మాయమైపోతున్నాయి
నేటి సమాజంలో
రక్త
సంబంధాలు.

-సంకా శోభారాణి.
9703858539.

ఆగవు
దాగవు

అస్థిరమైన ఆలోచనలు
ఎన్నేళ్ళైనా
ముందుకు
సాగవు......!!

-శ్రీమతి భారతీ కృష్ణ
99599 65215

మొగులు
బుగులు

అతివృష్టితో
రైతులపంటలకు
తగులుతుంది
ఒకటే తెగులు!

-డా.గన్నోజుశ్రీనివాసాచారి
9490145913

పిడుగులు..
చెడుగులు..

వర్షాలు
ఎక్కువైనా
తక్కువైనా బాధేపడే
రైతుబిడుగులు.

-విజయకుమారి
విజయవాడ

పుస్తక సమీక్షలు

# కవనగిరి మగ్న సంగీతం



సాహితీ లోకంలో శిఖరమై శోభిస్తున్న వారి నెరగని వారు ఉండరు. రోజు కవిత్వం రాయకుండా వారూ ఉండరు. వారే ఆచార్య ఎన్. గోపి గారు.

మార్పు కవిత్వం ద్వారానే సాధ్యమని నమ్మినవారు కనుకనే కవిత్వంలో నిమగ్నమై, కవిత్వాన్ని జీవితంగా మలుచుకుని, తనదైన మార్గంలో నిరాటంకంగా సాగిపోతున్న కవి.

ఇప్పటివరకు 30 కవితా సంకనాలు వెలువరించారు.

'మగ్న సంగీతం' గోపి గారి తాజా సంకలనం. మనల్ని భావ సంద్రంలోకి తీసుకెళ్లి, ముద్దగా తడిపేసే 76 కవితలున్నాయి ఇందులో..

మొదటి కవిత మగ్న సంగీతం లో

**'నిద్రా మెలుకువా ఒక్కటైన**
**ముద్రాంకిత స్థితి నాది**
**నేనిప్పుడు కవితలో ఉన్నాను.'**

అంటున్నారు నేటికీ రేపటికీ మధ్య అబద్ధాలు వచ్చి చేరుతాయని, అలా కాకుండా చూడ్డానికే నేను కవితలో ఉన్నానని, కవితామార్గదర్శి అవుతున్నాడు కవి.

చేతులు కవితలో

**'గోధుమ పిండిలో పాలు కలిపి**
**మలిచిన ట్టున్న**
**సిగ్ధ ముగ్ధ హస్తాలు'** అందమంటే ఆ చేతులదే అంటూ వర్ణిస్తూనే, ఆ చేతుల గురించి కాదు నేను మాట్లాడుతున్నది అంటారు. రాళ్లు కొట్టే బీటలు వారిన చేతులను, పంటలు పండించే పసిడి చేతులను, సంస్కృతిని సృష్టించే చేతులను, సృజనాత్మక చేతులను, గమ్యాలకు చేర్చే అనుబంధాల చేతులను, హృదయాలను పెనవేసే చేతులను కవి ఇష్టపడుతున్నాడు.

**'నిజానికి భూగోళానికి**
**చేతి బొమ్మను అతికించాలి'** అని

భావిస్తూ ఆ చేతులకు నమస్కరిస్తూ, కవిత రాసిన తన చేతిని కూడా అంకితం ఇవ్వడం చక్కని ముక్తాయింపు.

**'ఓ నా ట్రాఫిక్ దేవతా!**
**ఈ మహానుభావునికి కాస్త దారినివ్వు'**

**అంబులెన్స్ కవితలో రోడ్డు మీది**
**వాహనదారులకు మానవీయ సూచన.**

**'వీరుడా వెళ్లేటప్పుడు పడుకున్నావు**
**వచ్చేటప్పుడు నడిచొస్తావు చూడు**
**ఆల్ ది బెస్ట్'** అని ఆకాంక్షల కవచం అల్లిపెట్టాం మేమున్నాం ఏం కాదని ఆశిస్తూ ఆత్మీయంగా స్పందిస్తున్నాడు.

పుట్టినరోజు కవిత కొత్త పుస్తకం విడుదల కోసం పెట్టుకున్న మీటింగ్ కూడా

**'ఏం చేయమంటారు**
**వర్షాకాలంలో పుట్టాను**
**అందుకే**
**నా వ్యక్తిత్వంలో ఇంత తడి'**

అంటూ తడి తడిగా మొదలుపెట్టి మనసున్న కవిగా స్పందించారు.

**'మొయిలుకూనల్లారా**
**మోహ మాట పడకండి!**
**అంబరంలోని జల రాగిణిల ముందు**
**నా సంబర మెంతా!'**

రైతులు వర్షం కోసం ఆశగా చూస్తున్నప్పుడు వారి ఆర్తి ముందు నా కీర్తి ఎంత అనుకున్నారు.

ఇదే కవుల హృదయపు స్పందన. సామాజిక బాధ్యత.

అదేవిధంగా కూరెళ్ల విఠలాచార్య గురించి మారటం కాలం తప్పే కవితలో ఆయన అక్షర స్వప్నాన్ని వివరించారు.

**'వయసు మళ్ళింది**
**కనుచూపు తగ్గింది**
**వినికిడి కూడా అంతంతే!**
**ప్రయాణాలకు మనిషి సాయం అవసరమౌతున్నది'**

'కానీ అతని పిచ్చి అతనిది
ఆ పిచ్చిని గురించి విని
ప్రభుత్వం పద్మశ్రీని కూడా ప్రకటించింది'అంటారు ఆత్మీయంగా.

మానవుని మౌలిక సంవేదన మారుతుందా అని ప్రశ్నిస్తారు కూడా.

రెండు సమయాలు కవితలో ఆశారాజు గారిని ప్రేమగా అభిమానిస్తారు.

**'భావ ప్రయాణాలకు**
**జెట్ లాగ్ సమస్యలుండవు'** అంటారు.

'గడ్డం కవి' పంజాబ్ కవీంద్రుడు సుర్జిత్ పాటర్ నీ కౌగిలించుకుంటారు. హవ భావాలు వెండి తీగల్లో చిక్కుకున్నాయని, గడ్డం మెత్తగా గుచ్చుకుందని, ప్రతి కవితకు వేర్లు ఉంటాయని, అవి గడ్డం పోచల్లా అనిపిస్తున్నాయని కవిత్వం అల్లుతారు.

"మార్పు కవిత్వం ద్వారానే సాధ్యమని నమ్మినవారు కనుకనే కవిత్వంలో నిమగ్నమై, కవిత్వాన్ని జీవితంగా మలుచుకుని, తనదైన మార్గంలో నిరాటంకంగా సాగిపోతున్న కవి".

'పాట రెక్కల మీద' ప్రయాణించే భావుక కవి గోపి పంకజ్ ఉదాస్ గురించి

**'గొంతును హృదయాన్ని**
**కలిపి కుట్టడం నీకే సాధ్యం'**

అంటూ నువ్వు పాడుతుంటే నోటి నుంచి పువ్వులు రాలుతున్నట్టు ఉంది అని గుర్తు చేసుకుంటున్నారు. ఆ గాయకుడు లేకపోవడం కాలానికే నిశ్శబ్ద దోషమని వాపోతున్నాడు.

రుతుసంధి కవితలో రుతువుల గురించి చెప్తూ ముగింపులో

**'ఏ కాలానికి ఆ కాలం**
**ప్రత్యేకంగా ఉంటాయి**
**సంధి దశలోనే కొంచెం రంధి.**
**జీవితమూ అంతే**
**దాని నిత్య నూతన రహస్యం కూడా**
**ఇదే!'**

ఇలా చాలా సింపుల్ గా జీవిత సత్యాన్ని తత్వాన్ని వివరించిన తాత్వికుడు.

దుఃఖం కవితలో ఏడుపు దుఃఖం వేరువేరని అది ఎట్లాగో స్పష్టం చేస్తారు.

**'దుఃఖం**
**ఒక మబ్బు పట్టిన మొగులు'**
దుఃఖితుడు విషాద శోభితుడు అని

**'అతన్ని చూసి**
**సముద్రమే భయపడింది**
**అతనిలోని అగాధానికి**
**పాతాళం కూడా అదిరి పడింది.'**

ఈ కవితకు మానవీయమైన ముగింపు ఇలా ఉంది.

**అతని వెంట కాసేపు తిరుగుదాం**
**అతని దుఃఖం**
**కొంతైనా మనదవుతుంది.**

దొరికిన మిత్రుడు కవితలో పాత మిత్రుని వెతుక్కుంటున్న కవి గారికి జ్ఞాపకాలు బరువెక్కుతున్నాయి. స్నేహితుడు దొరికితే బాగుండు అనుకుంటున్నాడు. ఈ కవిత ముగింపు

**ఎదురుగా**
**ముందు ఎవరో వెళ్తుంటే**
**పరుగున సమీపించాను**
**ఇంతసేపు వెతుకుతున్నది ఇతన్నా!**

అని ఆశ్చర్యపోయాను. 'అతడు నేనే!'

గత వర్తమానాలతో సంభాషణ ఈ కవితలో మనం చూడొచ్చు. విరామం కవితలోనూ ఇదే విధమైన సంభాషణాత్మకమైన శైలి రమ్యత కనిపిస్తుంది.

**'యవ్వనం**
**తిరిగి రాకపోవచ్చు గాని**
**ఏ వయసుకైనా**
**అదే ఒక చోదక శక్తి'.**

జీవితాన్ని విశ్లేషిస్తూ ఎలా ఉండాలో కర్తవ్యాన్ని బోధించిన కవిత కూడా ఇది. కవి దృష్టిలో మరణం అంటే ఊపిరి ఆగిపోవడం కాదు నిర్వాపారం.

తాళం చెవి, సాక్సులు, పెన్సిల్ వంటి సాధారణమైన వస్తువులను కవిత్వీకరించి వాటికి మానవతా సొగసులద్ది అందమైన భావ చిత్రాలను మన ముందు ఉంచడం గోపి గారి ప్రత్యేకత మచ్చుకు ఒకటి

**'సాక్సుల పైన**
**పద్యం ఏమిటి** అని
**అనుకోకండి**
**కుందేలు పిల్లల్లాగా**
**ముడుచుకొని పడుకున్న**
**సాక్సులను చూస్తే ముచ్చటేస్తుంది నాకు**
**కాలు జొనిపితే**
**ఆత్మీయ కరస్పర్శలా ఉంటుంది.'**

ఇంకా చూడండి.

**'చెప్పుల్లో**
**విడిగా ఉండే వేళ్ళు**
**లోపల ఒకదాన్నొకటి కావలించుకుని**
**ప్రేమించుకుంటాయి.'**

కవిత ముగింపు కాశ్మీర్ అనుభూతి

**'ఒక వెచ్చని జ్ఞాపకం**
**పైకి కనిపించవు గాని**
**సాక్సులు నా పురోగమనానికి**
**సాక్షులు కూడా.**

డెలివరీ బాయ్, కలాయివాలా, క్షుర కార్మికుడు కవితలలో మానవీయమైన విలువలతో కూడిన కవి హృదయ సంస్కారాన్ని చూడవచ్చు.

ఉదాహరణకు డెలివరీ బాయ్ కవితలో

ఇల్లిల్లు తిరిగే అతని బ్యాగు బరువు ప్రపంచీకరణమంతా అంటారు.

**'పని ఏదైనా కానీ**
**గ్లోబలైజేషన్**
**ఇవాళ వీధిలో సంచరిస్తుంది**
**దేశాన్ని శాసించగలిగిన యువతను**
**బానిసలుగా మార్చేసింది.'**

ఈ విధంగా గోపిగారి కవిత్వపు తడి మన మనసులను తడిపి ఆ ఆర్ద్రతతో కూడిన సానుకూలమైన ఆలోచనలను కలిగిస్తాయి. గత వర్తమానాలలోకి ప్రవహిస్తూ మన మూలాలను స్పృశింపజేస్తాయి.

**'భోనగిరి గుట్ట'** ప్రత్యేకంగా చెప్పుకోవలసిన కవిత.

**'దాని పాదాల చెంతనే/**
**జన్మించాన్నేను**
**నేను కళ్ళు తెరిచిన నాటి నుండి**
**దర్శించే ప్రతి దృశ్యానికి**
**బ్యాక్ డ్రాప్ అదే'**

గుట్టతో తనకు గల అనుబంధాన్ని అనుభూతులను బాల్య స్మృతులను హృదయ మనోజ్ఞంగా వర్ణించారు.

**'గుట్ట లేకుండా**
**జీవితాన్ని ఊహించలేన్నేను**
**ప్రపంచంలో పలు దేశాలు తిరిగాను**
**అయినా ఇప్పటికీ**
**భోనగిరిగుట్టే నా చిరునామా'**

అంటున్నారు.

పుట్టి పెరిగిన ప్రాంతం మీద ఎవరికైనా మమకారం ఉండడం సహజం. అందునా భోనగిరి గుట్ట లాంటి ప్రఖ్యాతి చెందిన ప్రాంతం గురించి చెప్పేదే ముంది. ఆ గుట్ట ఔన్నత్యం తల పైకెత్తి తిరగడం నేర్పింది నాకు అంటారు నిజమే! ఇంతింతై కవనగి రిగా ఎదిగి అందరూ తలెత్తి చూ సేలా కవిత్వమై పరిమళి స్తున్న కవి గోపి. నిర్దిష్టమైన సరళమైన క్లుప్తతో కూడిన పదప్రయోగం ఈ కవి గారి ప్రత్యేక లక్షణం. సామాజిక ప్రగతిశీల భావనలు కవిత్వం నిండా పరచు కుంటాయి. ఈ మగ్న సంగీత కవితా సంపుటి కవిత్వాన్ని ఆస్వాదించే వారికి ఎంత గానో నచ్చుతుంది.

ఈ సందర్భంగా నానీల నాన్నగా ప్రసిద్ధులై కీర్తింప బడుతున్న గోపి నానకు మనస్ఫూర్తిగా అభినందనలు.

ఈ మధ్యనే (26-09- 20 25)వారి సహచరి కవయిత్రి రచయిత్రి అరుణమ్మ గారు నిష్క్రమించడం వారి మనసంతా చీకటి కమ్మింది. ఆమె జ్ఞాపకాలు అరుణ కాంతి గా ప్రసరించి త్వరలోనే గోపి సార్ ' రేపటి మైదా నం' లోకి పయనించి మళ్లీ కవిత్వంలో మగ్నం కావా లని, కాగలరని ఆశిస్తున్నాను.

**ప్రతులకు:**ఎన్.అరుణ
ఇ.నెం. 13-1/బి,
శ్రీనివాసపురం,
రామాంతపురం,
హైదరాబాద్-500 013.
సెల్: 93910 28496



-గడ్డం సులోచన
7702891559

# జీవన విలువలు కలిగిన వ్యక్తి 'సమ్మన్న'

హైదరాబాద్, నవంబర్ 26: ఉత్కృష్టమైన జీవన విలువలు కలిగిన వ్యక్తి ఈటెల సమ్మన్న అని ప్రముఖ కవి, సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్ అన్నారు.

ఈనెల 13న రవీంద్రభారతిలో తెలుగు సాహిత్య కళాపీఠం 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిగాయి. ఈటెల సమ్మన్న రచించిన "శరణాగతి", "సిరిమువ్వలు" నల్ల ఉపేందర్ రచించిన "కొండా లక్ష్మణ్ బాపూజీ శతకం" ఆవిష్కరణలో మౌనశ్రీ మల్లిక్ పుస్తక సమీక్ష చేస్తూ ఆధ్యాత్మిక ఉన్నత పర్వత పంక్తులపై నుండి హిమనీనదమై ప్రవహించే ఆనందం మనలో కొందరే పొందుతారని వారిలో ఒకరు ఈటెల సమ్మన్న అంటూ, తనకంటూ ఒక ప్రత్యేక శైలిని రూపొందించుకొని ఉత్తమ శ్రేణి కవిత్వాన్ని సుసంపన్నం చేస్తున్నారని అన్నారు.

విశిష్ట అతిథిగా విచ్చేసిన అంతర్జాతీయ పాత్రికేయులు ఎస్.వెంకటరమణ మాట్లాడుతూ మనిషి విలువల కోసం పాటుపడాలని, పలువురి క్షేమం కోసం ఎంతో కొంత సమయం కేటాయించి ఆదర్శ వ్యక్తిగా జీవించాలని అన్నారు. 15 సంవత్సరాల క్రితం "తెలుగు సాహిత్య కళాపీఠం" ఏర్పాటు చేసి సాహిత్య, సాంస్కృతిక, సామాజిక, కార్యక్రమాలను నిర్వహించిన చిక్కా రామదాసు జీవితం ధన్యం చేసుకున్నారని ఆత్మీయ అతిథి సీనియర్ జర్నలిస్టు బైస



ఈనె 13న గురువారం రవీంద్రభారతిలో డా॥ ఈటెల సమ్మన్న రచించిన 'శరణాగతి', 'సిరిమువ్వలు' మరియు నల్ల ఉపేందర్ రచన 'కొండా లక్ష్మణ్ బాపూజీ' శతకం పుస్తకావిష్కరణలో చిక్కా దేవదాస్, సి.హెచ్.రవికిరణ్, నల్ల ఉపేందర్ డా॥ ఎంపల్లి బుచ్చిరెడ్డి, బైస దేవదాసు, ఎస్. వెంకట నారాయణ, డా॥ఈటెల సమ్మన్న, దైవజ్ఞశర్మ, కురిమెళ్ళ నరసింహగౌడ్, మౌనశ్రీ మల్లిక్, పట్టాల అశోక్, చిక్కా శంకర్.

దేవదాసు కొనియాడారు. మన మధ్య చిక్కా రామదాసు లేకపోయినా వారి ఆశయాలను నెరవేరుస్తున్న సంస్థ కార్యవర్గాన్ని అభినందించారు.

మొదట చిక్కా రామదాసు మృతిపట్ల అందరూ ఒక నిమిషం మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. సభలో డా॥ఏనుగు నరసింహారెడ్డి, విశ్రాంత న్యాయమూర్తి నిమ్మ నారాయణ, డా॥ ఎంపల్లి బుచ్చిరెడ్డి, కురిమిళ్ళ నరసింహగౌడ్, పెద్దూరి వెంకటదాసు, గడ్డం సులోచన, తాటికొండ పట్టాభి, చిక్కా దేవదాసు, సి.హెచ్. రవి కిరణ్, చిక్కా రవికిరణ్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహిత్య కళాపీఠం అధ్యక్షులు డా॥ఈటెల సమ్మన్న మాట్లాడుతూ సంస్థ నిర్వహణకు ఎంతో మంది తమ సహాయ సహకారాలు అందిస్తున్నందుకు ధన్యవాదాలు తెలిపారు. పట్టాల అశోక్ అతిథులకు స్వాగతం పలికి సంస్థ కార్యక్రమాలను వివరించారు. బతుకమ్మ రాజశేఖర్ కళా బృందంచే సుస్వర సుమధుర రాగరంజిత గానామృత ఝురి అందరిని అలరించింది.

## ఒదిగి ఉండు

తెలిసింది తక్కువ
తెలియాల్సింది ఎక్కువ
మిడి జ్ఞానంతో మిడిసిపాటుతో
నలుగురిలో నగుబాటే
ఆకాశమంత విజ్ఞానఖజానా
తెలుసుకొని మసలుకొనే యత్నం
మార్గదర్శనానికి దర్పణం
అనవసర ఆర్భాటం అనే అహం
కిందికి దిగజారుస్తుంది
ఎదిగినా ఒదిగి ఉండు



-పత్తి శివప్రసాద్
9440001224





# డాక్టర్ కాల్వ మల్లయ్య రాసిన 16 గంటల యాదిలో మన పరిభ్రమణం నవల

పుస్తక సమీక్షలు

డాక్టర్ కాల్వ మల్లయ్య గారు ఉభయ తెలుగు రాష్ట్రాల లోని సుప్రసిద్ధ కథా నవలా రచయితగా ప్రసిద్ధులు. మీరు 1200 కి పైగా కథలు రాశారు. పలు నవలా రచనలు చేశారు. వివిధ సాహిత్య సంస్థల నుండి ద్వారా తాను రాసిన నవలలకు, కథా సంపుటాలకు ఎన్నెన్నో పురస్కారాలను అందుకున్నారు. ప్రస్తుతం సప్తతి దాటినప్పటికిని అలుపెరుగక సాహితీ రచనలు చేస్తూ, సాహిత్య సభల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ప్రస్తుతం వీరి వయస్సు 72 సంవత్సరాలు. వీరు చేసిన రచనలు సుమారు యాభై వరకు ముద్రిత మయ్యాయి. వీరి రచనలపై పలు విశ్వవిద్యాలయాల నుండి 30 మంది విద్యావంతులైన యువ పరిశోధకులు ఎంఫిల్ , పీ.హెచ్.డి పరిశోధనలు చేసి పట్టాలు పొందారు. మీరు ఉమ్మడి రాష్ట్రంలో తెలుగు అధికారిక భాషా కమిషన్ లో గౌరవ సభ్యులుగా పనిచేసి ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారికంగా తెలుగు అమలు విషయమై రాష్ట్రమంతా పర్యటనలు చేసి, తెలుగు భాష అభివృద్ధికి తన శాయ శక్తుల కృషి చేశారు.

వీరు ఇటీవల 16 గంటల యాదిలో మన పరిభ్రమణము అనే నవల ను విడుదల చేశారు. ఈ నవలను వీరు తమ సప్తతి వయస్సులో రాశారు. ఒకేరోజులో ఉదయం 6 గంటల నుండి మొదలైన వీరి నిత్య కార్యక్రమం రాత్రి 10 గంటల వరకు ముగుస్తుంది. ఈ పదహారు గంటల్లో జరిగిన తతంగాన్ని, సప్తతి కాలపు రచనలను, జీవితంలోని ఎత్తు పల్లాలను నెమరు వేసుకొన్నారు. అందులోని జ్ఞాపకాలను తన ఆత్మానుగతంగా, సందర్భోచితంగా చెబుతూ, ఒక నవలగా మలచడం రచయిత మలిచారు. రచయిత యొక్క ప్రతిభకు, ఆలోచనాధారలకు తార్కాణంగా ఈ నవల నిలిచింది. సుమారు 150 పేజీలలో తన ఆత్మకథగా, స్వీయ కథగా ఈ నవల రాయబడింది. ఈ నవలలో రచయిత తన ఇల్లు, కుటుంబము, పిల్లలు, తండ్రి లక్ష్మయ్య,, ఊరి దొర, ఉద్యోగము, తన జీవితము, పుట్టిన ఊరులోని బాల్య జీవితము, చదువులు, అప్పటి వాతావరణం, తన సాహిత్య రచనలు, తాను గెలుచుకొన్న జీవితం, తనకు నచ్చిన కవులు, సాహిత్య సమావేశాలలో పాల్గొన్న సన్నివేశాలు, చివరగా పురస్కారం స్వీకరిస్తున్న రవీంద్రభారతి సమావేశం తదితర అంశాలపై ఈ నవలలో చైతన్య స్రవంతి లో చర్చించారు. నవలలు రాయడంలో సిద్ధ హస్తులైన డాక్టర్ కాల్వమల్లయ్య గారు, ఈ నవలను పాఠకులకు తన జీవితాన్ని సాహిత్య వ్యాసంగాలతో ముడి పెట్టి, వివరించడానికి చేసిన బృహత్ ప్రయత్నమే.

తన డెబ్బయి ఏళ్ళ అనుభవాల్ని, నడిచిన, నడుస్తున్న కాలాన్ని ఇతివృత్తంగా తీసుకుని అరటిపండు వలిచినట్లుగా నవల ప్రారంభములో హైదరాబాదు నగర వాతావరణము, ఇక్కడి జనాలు, ఇక్కడ వీధులు, ఇక్కడి కాలుష్యము గూర్చి చర్చిస్తూనే పల్లెల్లో ఉన్న ప్రాకృతిక సౌందర్యం, చేన్లు, చెలకలు, పర్యావరణము, వ్యవసాయ వృత్తుల జీవితాలు, పల్లె వాసులు, ప్రేమ ఆప్యాయతలు గూర్చి చెబుతాడు. తెలుగు రాష్ట్రాల్లో మాతృభాష అయిన తెలుగు పట్ల జరుగుతున్న అన్యాయాన్ని, పాఠశాలల్లో తల్లిదండ్రులు తమ పిల్లలు ఆంగ్ల మాధ్యమంలో చేర్పించటాన్ని, కాలం తెచ్చిన మార్పులను గూర్చి చర్చిస్తారు.. 70 ఏళ్లగా నిర్వహిస్తున్న సాహిత్య వ్యాసంగాలను సాహితీ తపస్సుగా,ఒక యజ్ఞంగా వర్ణిస్తాడు. ఉదయము 7 గంటల సమయంలో తన మానస స్వప్నము లోని ఆలోచన ధారలను క్రమంగా వివరిస్తారు. మీడియా తీరు, ఐటి సాఫ్ట్వేర్ రంగము, గుర్తింపు కోల్పోతున్న భూమి రైతు వంటి ఉత్పత్తి రంగాలు, వ్యవసాయ రంగ సంక్షోభం గూర్చి చర్చిస్తారు. నేటి ప్రపంచీకరణ తెచ్చిన ముప్పులను ఆవేదనతో వివరిస్తారు.

ఉదయం 8 గంటల సమయంలో భార్య వచ్చి రచయితను నిద్ర నుండి లేపుతుంది. కొంత హాస్య ప్రియం తో కూడిన సంభాషణలు ఉంటాయి. రచనకు వచ్చిన పదివేల పారితోషికం గురించి భార్యకు చెప్తాడు. శ్రీమతి గారి సాహిత్య పరిచయం గూర్చి రచయిత కొంతవరకు ప్రశంసలతో ముంచెత్తుతారు. రచయిత తాను రాసిన బతుకు పుస్తకము నవల గూర్చి చర్చిస్తాడు. తన పిల్లల ఉన్నత చదువులు గూర్చి, రామగుండంలోని ఎఫ్. సి. ఐ మూతపడటం వల్ల కోల్పోయిన ఉద్యోగం గూర్చి చెబుతాడు. ఆసక్తిగా హైదరాబాదులో సొంత ఇల్లు విషయం కొనడం గూర్చి చర్చిస్తారు. అర్ధాంగి పుస్తకాలను గతంలో లాగా చదవడం మానివేసి, టీవీ సీరియళ్లు చూస్తున్న వైనాన్ని రచయిత ప్రస్తావన తెస్తాడు. ఉదయము 9 సమయంలో రచయిత కాల కృత్యాలు తీర్చుకోవడం కూరగాయలు, నాన్ వెజ్ తేవడం వంటి విషయాలపై ఆసక్తికరమైన చర్చలు ఉంటాయి. ఉదయం 10 గంటలకు రచయిత సాహిత్యము తనకు ఈరోజు ఇచ్చే పురస్కారం గూర్చి చర్చ జరుగుతుంది.

పగలు ఒంటిగంట సమయము. మిట్ట మధ్యాహ్నం. . ఆకలి సమయము భూమిపుత్రుల కూడా తినే సమయము. రైతులు శ్రామిక జీవులు పండించే పంటల వల్లనే రైతు రాజు కావాలి. రైతుకు బంగ్రోతు ఆదాయం కూడా దక్కడం లేదన్న ఆవేదనను వెలగకుతాడు. తెలంగాణలో వ్యవసాయ కుటుంబాల జీవన విధానాలు మెరుగు పడాలని కోరుకుంటారు. రచయిత తాను రాసిన భూమిపుత్రులు నవల గూర్చి సామాజిక సంఘర్షణ గూర్చి ప్రస్తావిస్తారు. రైతు ఆత్మ కథను తాను బతుకు పుస్తకంలో ఆవిష్కరించినట్లు చెబుతాడు. తన చిన్ననాటి గురువు మలయశ్రీ ప్రోత్సహించిన తీరును ప్రస్తావన తెస్తారు. రచయిత తాను చిన్నతనములో రాసిన విధి వ్రాత అనే నవల ప్రస్తుతము దొరకడం లేదని రచయిత చెప్తారు.





మధ్యాహ్నము రెండు గంటల సమయం. సాయంత్రము మీకు పురస్కారము ఉంది కదా పగలు కొంతసేపు విశ్రాంతి తీసుకోమని భార్య రచయితను కోరుతుంది. భార్య పదేపదే వ్యంగ్యంగా మాట్లాడటాన్ని అందులోని అంతరంగాన్ని రచయిత తన ఆలోచనల ద్వారా పాఠకులకు వివరించుకుంటూ పోతుంటారు. డిగ్రీ చదవడానికి కరీంనగర్ కు వెళ్ళినప్పుడు తాను జడ్పీలో జరిగే సాహిత్య సమావేశాలకు కవి సమ్మేళనకు క్రమం తప్పకుండా హాజరైతుండేవారు. నవలా రచయిత అంపశయ్య హాజరయ్యే సమావేశాలకు తప్పకుండా వెడుతుండేవారు. కాలేజీ గ్రంథాలయంలోని పలు నవలలను సాహిత్య పుస్తకాలను రచయిత మొత్తం వడబోసి చదివారు. ఇలా రచయిత తన కరీంనగర్ డిగ్రీ చదివిన రోజులలోని సాహిత్య వాతావరణం గూర్చి, అప్పటి ప్రభావం గూర్చి యాదిగా చర్చిస్తారు. పగలు మూడు గంటల సమయం. రవీంద్రభారతిలో సాహిత్య పురస్కారం స్వీకరించడానికి వెళ్లాల్సి ఉంది. విలువలు లేని రాజకీయాలు అంతగా తనకు ఇష్టం లేవని ఒకప్పుడు తాను విప్లవ రాజకీయాలను నమ్మితే ఆ తర్వాత ప్రజాస్వామ్యాన్ని మానవతను నమ్ముకున్నానని రచయిత చెప్తారు.

సాయంత్రము నాలుగు గంటల సమయము.శ్రీ శ్రీ, డా॥సినారే, మలయశ్రీ మొదలగు వారందరూ జ్ఞాపకం వచ్చినప్పటికిని, తనకు చదువు, ఉద్యోగము ముఖ్యమని తర్వాత తాను రచనలు చేస్తానని రచయిత నిర్ణయించుకుంటారు. పిల్లనిచ్చిన మామగారైన ఎస్కేపిల్లై మంచి కవి. కరీంనగర్ జిల్లా పరిషత్ కవి సమ్మేళనంలో కవిత చదివి ఆకర్షించానని చెప్పుకొచ్చారు. తాము ఇద్దరము రాసిన కవితలు డాక్టర్ మలయశ్రీ గారి తరంగిణి మ్యాగజైన్ లో అచ్చయ్యాయి. ఆ కవిత్వ బంధమే తమను కలిపిందని రచయిత చెప్తారు. తాను కరీంనగర్లో చదివిన మల్టీపర్పస్ పాఠశాలలో డాక్టర్ సినారె వచ్చారని తన మామగారు సినారె ఒకే పాఠశాలలో కలిసి చదువుకున్నారని రచయిత చెప్తారు. పెళ్లిచూపులు తర్వాత తన పెండ్లి పిల్లె గారి కూతురు వరంతో 23వ ఏటనే జరిగిపోయింది. అప్పుడు ఎమర్జెన్సీ నడుస్తున్న కాలం. ఉద్యోగాలకు దరఖాస్తులు చేసుకోవడం ఆఫీసుల చుట్టూ తిరగడము, పెళ్లయిన ఆరు నెలల్లోని మూడు ఉద్యోగాలు రావడము జరిగిపోయాయి.

సాయంత్రము 5 గంటల సమయము. మిత్రులు వ్యాగ్రేష్, వెంకటేష్ లతో సాహితీ సమాలోచనలు సాగాయి. సమావేశ మందిరానికి చేరుకున్నాడు. తన మిత్రులు కలిశారు. ఏమి రాస్తున్నాను, ఎవరికోసం, ఎందుకు రాయాలి అన్న ప్రశ్నలు ఉదయించాయి. శ్రామిక జీవుల కోసం రాయాలి. సామాజిక చరిత్రలను రాయాలి. ప్రేమ్చంద్ రవీంద్రుడు శ్రీ శ్రీ బంకిం చంద్ర, దాసరథి రంగాచార్య కాశీపట్నం, రావిశాస్త్రి యద్దనపూడి మాదిరెడ్డి, చలం, రంగనాయకమ్మ తదితరుల నవలలను సాహిత్యాన్ని చదివిన రచయిత తనకు సాహిత్య రచనలు ఇలా చేయాలో ఎందుకు రాయాలో విశ్లేషణ చేసుకున్నాడు. సురవరం లాగా సాంఘిక చరిత్రలను రాయాలని నిర్ణయించుకున్నారు. పీడిత తాడిత దీన జనుల కోసం, మానవ సమాజం కోసం రాయాలని నిర్ణయించుకున్నారు. ఇలా తన రచనల దృక్పథాన్ని స్థిరం చేసుకున్నాడు. ఇలా తన సాహితీ ప్రస్థానంలో తన రచనలపై యువ విద్యావంతులు 10 విశ్వవిద్యాలయాలలో పరిశోధనలు చేయడము మొదలుపెట్టారు. 30 పైగా ఎంఫిల్స్, పిహెచ్డీ పరిశోధనలు వచ్చాయి.

సాయంత్రము 6 గంటల సమయము. సభా ప్రాంగణానికి రచయిత చేరుకుంటాడు. ఎంతోమంది సాహితీ మిత్రులు కలిసి పలకరింపులు మొదలుపెట్టారు. రచయిత ముందు వరుసలో కూర్చున్నారు. రచయిత ఉద్దేశపూర్వకంగా జబ్బులను నయం చేసే ఒక వృత్తి డాక్టర్ గారిని కలిసి పలకరించారు. డాక్టర్ తో సంపాదన విషయమై రచయిత సీరియస్‌గా చర్చిస్తారు. అలాగే ఒక పారిశ్రామికవేత్తను, వ్యాపారి, పెద్ద ధనవంతుడిని కూడా కలిశాడు. మీ సంపాదనలో మానవాంశ ఉందా అని రచయిత వారిని నిజాయితీ వర్తనంగా ప్రశ్నిస్తాడు. ఇతరులను రచయితలుగా తీర్చిదిద్దడానికి తాను ఎంతో కృషి చేశారు.ఇలా యాది విషయాలు పాఠకులతో షేర్ చేసుకొంటారు. తన 15 గంటల ఆలోచన ధార.. సాహిత్యం చుట్టూ పరిభ్రమణము జీవితము చుట్టూ యాది అంశాల పరిభ్రమణము సాగిపోతుంటుంది. భాషలో గురజాడ ప్రజాకవనంలో శ్రీ శ్రీ, జాషువా.. ఇలా నా మార్గము అనితరసాధ్యము అంటూ తన సాహిత్య దృక్పథాన్ని రచయిత మరొకసారి యాదిగా చెబుతాడు. తన 50 ఏళ్ల జీవితంలో గుండెకు స్టంట్ లు వడినా, తన రచనలు ఆగకపోవడం, దుఃఖ నివారణ కోసము రచనలు చేస్తున్నానని మృత్యుంజయుడని రచయిత చెప్తారు.

రాత్రి 10 సమయము రచయిత సభ నుండి పురస్కారము అందుకొని తృప్తితో ఇంటికి చేరుకుంటారు. మనుమరాలు ఎదురువచ్చి తలుపులు తీస్తుంది. భార్యకు శాలువ , బిడ్డ చరితకు మెమొంటో ఇస్తారు. ఇలా ఒక ప్రముఖ రచయితగా ఐదు దశాబ్దాల పాటు సాహితీ ప్రస్థానాన్ని 16 గంటల్లో యాదిగా వివరించే ప్రయత్నం చేస్తాడు. ఈ నవల ద్వారా రచయిత యొక్క సాహితీ దృక్పథం, సాహిత్య జీవితం, రచనల సారం, సమాజ కోణము, దళిత బహుజనుల సముద్ధరణ, కార్మిక జీవుల సౌభాగ్యము మనకు తదితర అంశాలు యాదిగా మనకు తెలిసి వస్తాయి.

(నోటు: ఇది రచయిత ఆత్మకథ లాంటిది. ఒక్క రోజులోనే 18 గంటల తన సాహిత్య జీవితాన్ని గంటల వారిగా వివరించుకుంటూ పోతారు. తాను అంటే ఇకడ రచయిత అని అర్థం చేసుకోవాలి. రచయిత డా॥ కాలువ మల్లయ్య గారే.)

పుస్తకం పేరు: 16 గంటల యాదిలో మన:పరిభ్రమణం (నవల)

రచయిత: డా. కాల్వ మల్లయ్య గారు.

సెల్: 98493 77578, 91829 18567.

పేజీలు: 150, వెల: 150 రూపాయలు.



-సంకేపల్లి నాగేంద్రశర్మ
8074826371

## నానీలు

అక్షరం మట్టిలో
స్పందనలు నాటు
కవిత్వం చెట్టుతో
హరితాన్ని మీటు.

ఆకాశంలో
ఎన్ని బల్బులో!
చుక్కలకు
కరెండు అక్కర్లేదు మరి!

బుద్ధుడికి ప్రబుద్ధుడికి
ఒకటే తేడా
అది వెలుగు మేడ
ఇది నీడ.

జీవితం జామెట్రీ
సంసారం కెమిస్ట్రీ
మరి ప్రేమ!?
మధురమైన పోయెట్రీ.

కుర్చీకే కాక్రా
హోదాకే బాకా
భ్రమ తొలగిపోతుంది
నిండా మునిగినాక.



-డా॥శిరీష
సెల్:98660 50220

## హైకూలు

ఇప్పుడు లేను
ఐనా అన్నీ చూస్తున్నా
నేత్ర దానంతో.

కొస్తంత చోటే
విశాల హృదయంలో
అమ్మ కోరిక

మనిషి భారం
ఎలా భరించాలని
చెప్పుల బాధ.

తుఫాన్ గాలికి
గూడు చెదిరిందని
కాకి ఏడ్చింది

కొత్త వెలుగు
అందరికీ ఉల్లాసం
పాప పుట్టింది.



- బొబ్బిలి జోసెఫ్
సెల్: 9989261991

## ఓల్డ్ మోడల్

కేకుల్లో.. కేకల్లో సంతోషాన్ని చూడడం
అలవాటు చేసుకున్నాక...
ఆత్మీయ ఆలింగనాలు
మనసునిండే చల్లని కబుర్లు
బోర్ గానే అనిపిస్తాయేమో..
లేటెస్ట్ ట్రెండ్ ఫాలో అవని వాళ్లంతా
ఇప్పుడు ఓల్డ్ మోడల్స్...
జీవించడంలోని ఆనందాన్ని ఎరుగని
అసమర్థులనే అర్థం...
హోటల్లో పార్టీలు..కార్లలో షికార్లు
ఖరీదైన బట్టలు భంగిమలతో
క్లిక్... క్లిక్... లు ఇవి ఉంటేనే...
మనుషులుగా, స్నేహాలుగా గుర్తింపు ఇప్పుడు..
ఎప్పుడో మనసు తలిస్తే కలుసుకొని
కష్ట సుఖాలు పంచుకోవడం..
ఇప్పుడు ఓల్డ్ మోడల్...
అంతే మరి కాలం మారిపోయింది..
చెలిమికి, వలపుకు, కూడా
కొత్త రూపాలు పుట్టుకొచ్చాయి...
ట్రెండ్ ఫాలో కాలేకపోతే..
చిరాకు నెందుకు ప్రదర్శించడం..!?
విమర్శలెందుకు మనసుకు తీసుకోవడం..
ఏ పచ్చని చెట్టుకిందో..
ఏకాంత ప్రదేశం లోనో కూర్చుని
బ్రతుకు పుస్తకాన్ని పట్టుకొని చదువుకో...
అప్పుడీ ప్రపంచం నిన్ను పట్టించుకోదు
నువ్వో మాలోకమని వదిలేస్తుంది...
అప్పుడు నీలోకంలో నువ్వు విహరించు..!!

-అనూశ్రీ గౌరోజు

## మిర్చి..ఓ..మిర్చి

ప్రియమైన..మిర్చి
ఘనమైన నీ ఘాటు రూపం
నిలవని విలువలా మారింది.
ఎర్రెర్రని నీ సహజ సౌందర్యం
తూర్పున విరిసే అరుణోదయం
పడమర పాడిన సంధ్యారాగం.
పచ్చి మిర్చి ,ఎండు మిర్చి
ఎలా పిలిచినా..నీకున్న ఆహార్యం,
అరుదైన లావణ్యం..అందరికీ పరిచయమే.
ఇక్కడ ధరల కాటును
తట్టుకొని నువ్వు నిలబడాలి.
రోజు రోజుకూ మంచులా కరిగే
రేటు దెబ్బను తట్టుకోవాలి.
దర్జాగా తిరిగే దళారీతనం -
కమీషన్ కొరడాను తిప్పుతుంది.
దోపిడీ దర్వాజాను తెరిచి
చేతికందిన ఫలాన్ని లాక్కుంటుంది.
నిన్ను ప్రేమగా పండించే రైతును
కలతల కన్నీటికి దగ్గరచేస్తుంది.
రైతు గుండె గుభేల్ మనేలా
ధరలు ధమాలంటూ పడిపోయి -
పెట్టుబడిదారులు చెప్పినట్లుగా
తూగుడుబల్లనెక్కి ఆడుతాయి.
ఒడిదుడుకుల బ్రతుకు బండిని
ఎగుడు దిగుడు దారి వెంబడి
అడ్డదిడ్డంగా నడవమని శాసిస్తాయి.
చిర్రెత్తిపోయి చిటపటలాడే ఎండకంటే -
నీ ఘాటు జెండా గర్జన ఎవరికైనా ఎరుకే!
అది ఏ కాలంలోను వెనక్కి తగ్గదు.
ఎవరి నోటిలోనూ తియ్యగా మారదు.
ఏ కూరలోనైనా నువ్వు ఎక్కువైతేచాలు
గూబ గుయ్యమనే మంటతంటా వెంటపడి
నషాళానికి అంటుకొని ఎంతకీ దిగనంటది.
అసలు..నీ గురించి నీకు తెలీక
మౌనంగా ఉండిపోయావు గానీ
ఎన్ని ఉద్యమాలను నువ్వు చూడలేదు.
అనేక పోరాట సమయాలలో -
వీరనారీమణుల పిడికిళ్లనుంచి
కారం అనే అస్త్రమై రివ్వునెగిరి
అణిచివేతదారుల కళ్ళల్లోపడి
భగ్గునమండి వెంటతరమలేదూ!
రంపపితూరిలో రగిలే మిరప టపావై
ఆంగ్లేయులకు వొణుకు పుట్టించలేదూ!
నువ్వే కాదు..అన్ని పంటల పరిస్థితీ ఇదే.
కొనుగోలుకు అందలేనంత.. ఎత్తులో
నిత్యం పెరిగే ధరలు చేస్తున్న.. దాడిలో
వ్యాపార సూత్రాలు వేసిన.. వలలో
ఎగుమతులు,దిగుమతులు ఆడే..ఆటలో
సుంకాలు,ప్రతీకార సుంకాలు చూపిన..దారిలో
నలిగి..పగిలి..పనికిరాకుండా పోతున్న
వివిధ వస్తువుల ఉనికి ఇప్పుడు ప్రశ్నార్థకం!?
మిర్చి..ఓ..మిర్చి
అగ్రరాజ్యాల తెంపరితనాన్ని అడ్డుకోవాలి
అవసరమైనపుడు అలజడిని సృష్టించాలి.
మార్కెట్టు మాయాజాలంపై ఎదురుతిరగాలి!
(గిట్టుబాటు ధర లేక భారీగా నష్టపోయిన మిరప పంట రైతుల దుస్థితిని చూసాక..)



-బి. గోవర్ధనరావు
94419 68930

## గాయాల లోగిలి

విధి రాసిన రాతనో తెలియదాయె
మనుషులు మదిలో చేసేటి గాయాలో తెలిదాయె
కరెన్సీ నోటుకోసమై నిలువునా చిదిమేస్తూవుంటే
మానవత్వంతో నిండిన హృదయాన్ని ముక్కలు చేస్తూవుంటే
రుజువులేని నిందలను నిత్యం అత్తరులా చల్లుతుంటే
గాయపడిన గుండెలోగిలి కన్నీటితో సేద దీరుతుంది
జాలీలేని మనుషులుతో నిత్యము దగా పడుతూనే
అనురాగంతో అభిషేకించిన పెదాలు నిందెలతో వెంటాడుతుంటే
మది తలచని ఇష్టాలకు బలి పశువువై జీవచ్ఛవమై బ్రతుకుతున్నా!
యెన్నో సార్లు విసిగిపోయి ప్రశాంత కోసమై పోరాడుతూ ఓనీటరినై నిలుస్తున్నా
కలిసి వచ్చే కాలం కోసమై నిత్యము వేసి చూస్తూనే
భవిష్యత్తును నిలువునా చిదిమేసే మానవ మృగాలను మానత్వనీతో మన్నిస్తూ
చరిత్రలో చేరగిపోని పేజీ కోసమై నిత్యము శ్రమిస్తూనే
నేనే ఉదయించే ఓ విప్లవ గీతమై జీవిస్తున్నా!!
చిరువవ్వును ముద్దాడుతూ నిత్యము విజయాలను ఆస్వాదిస్తూ
నిలువునా గాయాల లోగిలిలో నిలుస్తున్నా !!



-ధనాశి ఉషారాణి
9121096397

## నిజమైన బ్రహ్మోపాసకులు జక్కని



ప్రతులకు: 'గురుకృప'
నెం.7-2-109, సుభాష్‌నగర్
సిరిసిల్ల-505 301. రాజన్న సిరిసిల్ల జిల్లా సెల్: 9440021734

జక్కని వేంకటరాజం గారు తత్త్వజ్ఞులైన కవీశ్వరులు. **'అర్ధరాత్రి సూర్యుడు'** కవితా సంపుటి తర్వాత, వారి కలం నుండి ఎన్నో ఉత్తమ కృతులు వెలువడినవి. 'ఆటవెలదులు-తేటగీతులు' వారి జ్ఞాన తృష్ణను అభివ్యక్త పరచగా 'వేంకటరాజ శతకం' జీవన పరమార్థాన్ని తెలియజేస్తుంది.

జక్కని వారి ప్రత్యేకత ఏమంటే వారు ఏడు ఉపనిషత్తులను ముత్యాల సరాలలో రచించి తెలుగు భారతికి భక్తితో సమర్పించారు. పదికి మించిన కృతులు వారందించినా, మదికి నచ్చని పనిచేయరు.

ఇప్పుడీ 'శ్రీరామ శతకం'లో దశరథ రాముని చరిత్రకాక, లోక విషయాలను సూక్ష్మ దృష్టితో కంద పద్యాలో పొందుపరచడం జరిగింది. వీరు రాముణ్ణి ఆత్మారామునిగా సంబోధించి చెప్పిన పద్యాలిందు లో ఉన్నవి. శ్రీరామ శతకంలోని ప్రతిపద్యం ఒక ఆణిముత్యమై అలరారుతుంది. ఏ పద్యానికి ఆ పద్యమే హృద్యమై మరల మరల చదవాలనిపిస్తుంది. ఈశ్వరనామ స్మరణచే పునీతమైన హృద యం జక్కని వారిది. బ్రహ్మతత్త్వం తెలిసిన వారు తప్ప మరొకరు రాయలేరంటానికి ఈ క్రింది పద్యమే తార్కాణం.

**బ్రహ్మోపాసన జేయుచు**
**బ్రహ్మమ్మున నేను సతము బరగుచు నుందున్**
**బ్రహ్మమె సర్వము కావున**
**బ్రహ్మము ననుభూతి జెంది బ్రతుకుదు రామా!**

**ఈ పద్యం ఒక్కటి చాలు జక్కని వేంకటరాజం** గారు బ్రహ్మోపాసకులనడానికి.

మానవుడు యోగసాధకుడైతే ఈశ్వరుని శరణు వేడుకుంటాడు. ఈశ్వర ధ్యానంలోనే సదాకాలం గడుపుతాడు. శ్రవణమనననిధి ధ్యానలు ఈశ్వరోన్ముఖంగా సాగినపుడు, ప్రత్యా హారం సిద్ధించి ధ్యానానికి మార్గం సులభమవు తుంది.

ధర్మమంటే వేదవిహిత కర్మ. అందుకే ఈ ఆచార్యుడు **"వేద విహిత కర్మలనే మోదముగా ఆచరించ"**గలిగినాడు. చాలా మంది దృష్టిలో కావ్య మంటే రామాయణమో, భారతమో అవుతుంది. నిజానికి కావ్యమంటే శ్రుతి లేదా ఉపనిషత్తు. కనుకనే జక్కని వారు **"కబ్బం బనగ నుపనిషత్ కబ్బమె నా ప్రాణమయ్యె కనుమా రామా!"** అని తన నిశ్చయ జ్ఞానాన్ని తెలిపినారు.

జక్కని జీవితంలో సమదర్శకుడుగా ఉండడానికి విశేషంగా యత్నించారు. పులుగడిగిన ముత్యంలా ఉండడానికి ప్రయత్నించారు.

ఇది శ్రీరామశతకమైనా, నిజానికి ఆత్మారాముని మనస్సులో నిలుపుకొని చెప్పిన పద్యాలే నాకు గోచరిస్తున్నాయి.

వేద సిద్ధాంతాన్ని పూర్తిగా అవగాహన చేసుకున్న ఆచార్యులు నేడు కనిపించరు. కాని జక్కని వారు ప్రకృతి పురుష వివేకం కల్గి, బ్రహ్మతత్త్వాన్ని ఆవిష్కరించారు. అందుకే **"రచనలు గావించెద నే నచలుని పొందంగ దలచి"** అని సర్వ వ్యాపకుడైన పరమేశ్వరుణ్ణి కీర్తిస్తారు.

'అక్షరం' క్షరం కానిది. అక్షర పరబ్రహ్మ ఈశ్వరుడు. అతణ్ణి ఆశ్రయిస్తే శాశ్వత సుఖం (మోక్షం) లభిస్తుందనే పూర్ణ విశ్వాసం జక్కనిది. అందుకే జీవన్ముక్తుడు కావడానికి యోగసాధన

### జక్కని వెంకటరాజం రచన శ్రీ రామశతకం పుస్తకానికి ఆచార్య మసన చెన్నప్ప రాసిన ముందు మాట

అత్యావశ్యకమని తెలియజేసినారు.

లక్ష్యం కష్టకరమైంది. బ్రహ్మాయే లక్ష్యమైనప్పుడు సాధకుడు నిర్గుణ బ్రహ్మము నాశ్రయించక తప్పదు.

**దుర్గమమగు నా లక్ష్యము**
**స్వర్గము నాకేమి వలదు శాంతియె చాలున్**
**నిర్గుణ బ్రహ్మము జేరగ**
**మార్గమునే నాకుజూపు మహిలో రామా!**
(80)

ఇహపరలోకాలకంటే భిన్నమైంది ముక్తిధామం. అది బ్రహ్మ సాక్షాత్కారం కల్గిన వారి స్వగృహం. యోగసాధకులు దానిలో ప్రవేశించడానికే ఇష్టపడుతారనటానికి ఈ క్రింది పద్యం జక్కని ఉదాహరణ.

**ఎంతో దూరము లేదిక**
**స్వతంతగృహము చేరగల్గ సమయము వచ్చెన్**
**చింతలు తొలగించి ఆత్మ**
**స్వాంతన చేకూర్చుమయ్య సద్గుణ రామా!**(81)

జక్కని వారు వాదాలకంటె వేదాలనే నమ్ముకున్నవారు. మతాల కంటే మానవత్వానికే అగ్రతాంబూలం ఇచ్చినవారు. పూజల కంటే ధ్యానానికే ప్రాధాన్యం ఇచ్చిన వారు.

వయోభారం లెక్క చేయక సత్కృతులతో సర్వేశ్వరుని స్మరిస్తూ. సమా జసేవ చేస్తున్న ఆచార్యులు శ్రీజక్కని వారి కృషికి అభినందనలు తెలియజేస్తున్నాను.



- మసన చెన్నప్ప
9885654381

## మానవత్వం మళ్ళీ పురుడోసుకోవాలి

ఆకలి వెక్కిరిస్తున్నప్పుడు
కవిత్వం శోకగ్రస్తం.
సామాన్యుడు
విలవిలలాడుతున్నప్పుడు
కవిత్వం కన్నీటి దుఃఖం.
కవి కి నిద్ర రాదు
నిద్ర పడతే కలం
ఆగిపోయినట్టు కల.
కాలం
చెదిరిపోయినట్టు కల
కవిత్వం దుఃఖం
వీడిపోని బంధాలు
కన్నీరు...
బాధ తీరనంతవరకు
కలమే .....
ఆశల మార్గం .
రైతు గుండె పగిలి
ఆకాశాన్ని చూస్తున్నది .
మనిషి గుండె పగిలి
మమకారం కై చూస్తున్నది .
నేను పండించిన పంట
నా కడుపు నింప లేనప్పుడు.
జన్మనిచ్చిన ఈ మట్టి
నా
ఉనికిని ప్రశ్నిస్తున్నప్పుడు.
నా అడవి కబళించబడి
రక్తమోడుతున్నప్పుడు.
మతమారణ హోమం
నిలువునా దహిస్తున్నప్పుడు .
భూమి గాయాలతో
నిలువునా పగులుతున్న ప్పుడు.
ఆర్తనాదా లే అంతట
నిండుకుంటున్నప్పుడు .
బలహీనుడు నిలువునా
దహించబడుతున్నప్పుడు.
సామాన్యుడి కేకలు
ఏ చెవినా పడనప్పుడు .
వినాశక చర్యలు
విపరీతమై నప్పుడు.
ప్రకృతి తో ఆటలు
ప్రతి గుండెలో మంటలు
ఆగకుండా పెరిగినప్పుడు
ఆకాశమా .......
ఆయుధం కాకుండా
మూగబోతావెందుకు ?
కలమా ......
చూస్తూ ఊరుకుంటూ
దుఃఖిస్తూ వెనీదుకు ?
ఎంత కాలం మోస్తుంది
అన్యాయం ఈ
కాలం
రాజ్యానికి కన్నీరు రాదు
ప్రశ్న లేకుండా
బదులు లేదు
ప్రశ్న
ఇప్పుడు సామాన్యుని
గొంతులో పేలాలి .
ప్రశ్న ఇప్పుడు
ఆకాశమవ్వాలి
ప్రశ్న ఇప్పుడు
పిడికి లై మెరవాలి .
ప్రతి అక్షరం
పోరుకేతనమవ్వాలి .
మానవత్వం
ప్రతి హృదయంలో
మళ్లీ
పురుడోసుకోవాలి.



-సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

## ఇదే మన ప్రజాస్వామ్యం

చెప్పేదొకటైతే చేసేది మరొకటై
పొంతనలేని మాటలతో బోల్తా కొట్టిస్తారు
మర్మం ఎరుగని చేతలతో మోసంచేస్తారు
చెట్టుకు చెదలు పుట్టించి మొదలుకే నరికేస్తారు
కొరలు పీకిన పాముల్లా పడి ఉండమంటూ ప్రజలను శాసిస్తారు
అనాదిగా వస్తున్న ఆచారాన్ని పుక్కిట బట్టి పురాణాలను వినిపిస్తారు
తుప్పు పట్టిన ఆయుధాలను తెచ్చి
జనం ఆలోచనలను తెగ నరుకుతారు
నరం లేని నాలుకను ఆడిస్తూ తిమ్మిని బొమ్మిని చేసి చూపిస్తారు
తెరమీద బొమ్మలను తెచ్చి ఆడిస్తూ వినోదాన్ని పంచుకుంటారు
నాగరికత అంటూనే అనాగరికంగా ప్రవర్తిస్తూ నిజం అన్నట్టు నమ్మిస్తారు
నిజాయితీగా నడిచే వారికీ అగ్ని పరీక్షలకు గురిచేస్తూ కట కటాలా వెనకకు నెడతారు
రాజకీయ చదరంగంలో ప్రజలను పావులుగా వాడుకొంటూ పబ్బం గడిపేవారు
శవాల మీద రాజకీయం చేస్తూ సమాధుల మీద రాజ్యాలను నిర్మించి ఇదే మన ప్రజాస్వామ్యం అంటారు
ప్రజలు తిరిగి ప్రశ్నించకుండా ఉండేందుకు నోటికి తాళం వేసి నోరు మూయిస్తారు
ప్రజల ఓట్లమీద పబ్బం గడిపే వాళ్ళు
ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసి
మరో మారు మోసం చేసేందుకు సిద్ధమవుతు పిచ్చిగా నమ్మే గొర్రెల మందలోకి చేరి
మేక వన్నె పులులై
నిజస్వరూపాన్ని దాచి పెడుతూ అసత్యపు వాగ్దానాలతో ఉచితాల ఎరను వేసి
ఎప్పటిలాగే అమాయక ప్రజలను ఆకర్షిస్తారు!!!



-ఎస్.జవేరియా
9849931255

## బంధాలు అనుబంధాలు

ప్రేమ, ఆప్యాయత, అను రాగాలకు
పుట్టిన ఇల్లు మన దేశం
బంధాలు బంధుత్వాలు
ఉమ్మడి కుంటుబ వ్యవస్థలో
కొట్టు వచ్చినట్లు కనపడతాయి...
మానవ సంబంధాలు పల్లె
వాతావరణంలో కనబడతాయి.....
పాశ్చాత్య కల్చర్ కు బానిసలౌతున్న
వారిలో బంధాలు బంధుత్వాలు
పల్చబడుతున్నాయి.....
బంధాలు బంధుత్వాలు
బంధు మిత్రులతో ముడిపడి ఉంటాయి....
ఉమ్మడి కుటుంబాలకు నిలయం
గ్రామీణ ప్రాంతాలు.......
బంధాలు అనుబంధాలపైనే
మానవ మనుగడ నడుస్తుంది.



-మిద్దె సురేష్
9701209355

# గురుబ్రహ్మ-డా॥కె.బాలస్వామి శతక పద్య సంపుటి

పుస్తక సమీక్ష

తెలంగాణ సాహితీ సీమలో పరంపరాగత బంధురమైన ధార్మిక జ్ఞానపథుడైన కవి, పరిశోధకుడు, డా॥ కపిలవాయి లింగమూర్తి శిష్యుడైన డా॥కె. బాలస్వామి **'గురు బ్రహ్మ'** పేరిట శతకపద్య కావ్యాన్ని సమర్పించారు. 116 కంద పద్యాల తో జ్ఞాన భాస్కరుడైన గురువును ప్రస్తుతించే ఈ కావ్యాన్ని గురు దక్షిణగా, గురువు ఆదేశానుసారం గురుపత్నికి అంకితం యివ్వటం విశేషాంశం. నేటి కాలంలో కూడా గురు శిష్య సంబంధాలు పవిత్రంగా కొనసాగాలనే స్ఫూర్తి ఈ చిరు కావ్యం అందిస్తోంది. శతాధిక కావ్య సృష్టితో తన జీవితమే అధ్యయనం, అధ్యాప నంగా, యింటిని సరస్వతీ నిలయంగా తీర్చిదిద్దుకుని భోధకునిగా, శోధక, పరిశోధక కవి, పండిత పరిష్కర్తగా కపిలవాయి వారి సాహితీ మూర్తిమం తం ఎందరినో ప్రభావితం చేసింది. **"నా కావ్యము గురు బ్రహ్మగ నే కాలము నందు గాని యిలలో వెలుగున్"** ఆకాంక్షతో వస్తువులో, ఛందస్సులో, ప్రక్రియలో ఈ శతకం విశిష్ట కృతిగా డా॥ బాలస్వామి అక్షరీకరించారు. స్థానిక చారిత్రక అంశాలకు, ఆలయ క్షేత్రాలకు. కవి పండిత వంశాలు, పరిశోధనా అధ్యనంతో కావ్యాలను సృష్టించిన డా॥ కపిలవాయి గురుత్వంలో ఎందరో సాహితీవేత్తలు ఆదర్శనీ యంగా తెలంగాణ సాహిత్యాన్ని సుసంపన్నవంతం చేస్తున్నారు. నేటి విద్యావిధానంలో సిలబస్ మాత్రం పూర్తిచేసి, పరీక్షలు మాత్రమే వ్రాయి ంచే గురువులు జ్ఞానధనాన్ని అందించగలరు కాని డా॥కె. బాలస్వామి, చారిత్రక, ఆధ్యాత్మిక తత్త్వశీలి డా॥ కపిలవాయి నుండి పొందిన గురు కృపాకటాక్షంలోని మహత్త్యం అందించలేరు. అందువలన

**"సద్గురువై వెలుగొందుచు**
**సద్గ్రంథంబులు రచించి సత్యపథంబున్**
**ఉద్ఘాటించెను సతతము**
**మద్గురుడగు లింగమూర్తి**
**మహిమాన్వితుడై"** డా॥కె. బాలస్వామి తనకు స్ఫూర్తిదాత, జ్ఞానదాత అయిన 'కపిలవాయి' వారి ఋణం తీర్చుకోవటానికి సమర్పించిన ఈ శతాధిక కందపద్య కావ్య ప్రస్తుతి సంపుటిలో అన్నారు.

ప్రముఖ కవి వరేణ్యుడు కపిల వాయి వారి జయంతి సందర్భంగా కపిలవాయి అశోక్‌బాబు వెలువరిం చిన 'గురుబ్రహ్మ', గురుస్థానం సాక్షాత్తు పరబ్రహ్మగా వర్ధిల్లేటట్లుగా, ముందు తరాల యువత తమ జీవితాలను ప్రకాశింప చేసుకోవాలనే మహదాశయాన్ని ప్రతిబింబింప చేస్తోంది.



**-జయసూర్య**
సెల్:9440664610



**ప్రతులకు:**
కపిలవాయి అశోక్‌బాబు
ఇ.నెం.17-110, వాణీసదనం
విద్యానగర్ కాలనీ.
నాగర్‌కర్నూల్-509 209
సెల్: 8790727772
9959653115

"బాలుడు బాలస్వామిని లీలగా పైబడియె యేడులే, యిల లోనన్ మేలెరుగను కీడెరుగను చాలును దీవనలు మీది సంపదలవియే!" అంటూ డా॥ బాలస్వామి పద్య కావ్యాన్ని గురుభక్తి తత్పరతతో స్తుతించారు.

---



ఫేస్ బుక్ "అమరావతి సాహితీ మిత్రులు" గ్రూపులో డా. రావి రంగారావు 2024 నుండి నిరంతరాయంగా నిర్వహిస్తున్న వారం వారం కవితల వర్క్ షాపులు.

"వారం వారం కవితల వర్క్ షాప్" 42 కు మొత్తం 11 మంది కవులు తమ కవితలు పోస్ట్ చేశారు. అంశం "పారిశుధ్య కార్మికులు". 4 కవితలకు ప్రశంసా పత్రాలు లభించాయి.

అడ్మిన్:
**-డా॥రావి రంగారావు**
9247581825

## పారిశుధ్య కార్మికులు

చీపురే కమాను,
వీధే వయొలిన్
ఆమె కన్నా
గొప్ప సంగీతాన్ని
పలికించేదెవరు...
పారిశుధ్య కార్మికురాలా,
మా మనసుల్లో
పోగుపడిన చెత్తనుకూడా
ఊడ్చి పారేయవా ప్లీజ్...
వీధే తరగతి గది,
పరిశుభ్రతే పాఠం,
ఆమె వో టీచరు...
వీధే పలక,
చీపురే బలపం
ఆమె దిద్దే ఐదక్షరాలు
పరిశుభ్రత...
పొద్దున్నే
అన్ని వీధుల్నీ నిద్రలేపే
చీపురు అలారం ఆమె

-చిత్తలూరి, హైదరాబాద్

## పరిశుభ్రతా దేవుళ్ళు

వాళ్ళు
కన్నతల్లి సేవలను
ఊరికంతా
అందించే వాళ్ళు,
వారు అశుభ్రాన్ని
శుభ్రం చేసే
డిగ్రీ లేని
ఆరోగ్య పరిరక్షకులు...
వాళ్ళు
స్వేదం చిందించే
పరిశుభ్ర కార్మికులు,
సేవలకు మలిన ముండదు,
అయినా
ఊరు వారి నంటుకోదు...
వాళ్ళు
ఏ యుగం శాపమో
పామై కాటేస్తుంటే
మౌనంగా రోదిస్తున్నారు వాళ్ళు,
దేవుడు కూడా
నోరు మెదల్చడు...
వాళ్ళు
శ్రమైక జీవన సౌదర్యం
అనుభవిస్తున్నా
గౌరవం నోచుకోని వాళ్ళు,
ప్రశ్నించడం తెలియని వాళ్ళు...
వాళ్ళు
కట్టు బానిసలై
తెగిపడని సంకెళ్ళు
మోస్తున్న వాళ్ళు,
ఎదురు తిరగలేని
అశక్తులువాళ్ళు...
పరిశుభ్రతా దేవుళ్ళు
పారిశుధ్య కార్మికులు వాళ్ళు

**-అనుముల బదరీనారాయణ,**
బెంగుళూరు

## పాకీపని

పాప భారమంతా
తన మెత్తని భుజమ్మీద
సిలువ మోసినట్టు..
తన అపరంజీ పాదాల్లో
ముళ్ళు దిగినా...
శ్రమల్ని చిరకలోని
నీళ్లు తాగినట్టు..
వాళ్ళు
భుజమ్మీద చీపురు కర్రేసుకుని
మలం తట్టలు మోయడానికి
తమ పిల్లల చేతులకు కూడా
పుస్తకాలు బదులు గమేళాలిచ్చి
చేతుల్లో మేకులు దిగ్గొట్టుకుంటున్నోళ్లు...
మన కోసం మన ఆరోగ్యం కోసం
వేకువ చుక్కయి పొడిసినోళ్లు.
వీధుల్ని మురికి కాలవల్ని
తమ స్వహస్తాలతో ముట్టి
స్వస్థత పరిచే..
పారిశుధ్య కార్మికులే
పరిశుద్ధ యేసయ్యల్లా కనపడతారు.
ఇంత కాలం..
ఎంత అప్పు పడ్డదో ఈ దేశం
ఎప్పుడూ మనుషుల లెక్కల్లో
జమకట్టలేదు చుట్టూ సమాజం.
సమాజులో.. ప్రార్ధనలో.. పూజల్లో
అతన్నెప్పుడూ తలుచుకొనేలేదు..
పండులా ఒలుచుకుతింటమే తప్ప...
ఏం తిన్నారో..తాగారో.
రోగమొచ్చినా..రొష్టొచ్చినా..
ఎలా ఉన్నారో అని.. దగ్గరై
పలకరించని వాళ్ళం..
ఇంట్లోనో వీధిలోనో చెత్త పేరుకపోతే
ఈ చెత్త నాయాళ్లు ఎక్కడ చచ్చారో అని
శాపనార్ధాలు పెట్టినోళ్లం..
ఓ కవిత రాసినప్పుడో
ఓ చిత్రం గీసినప్పుడో..
ఓ సాహస కృత్యం చూసినప్పుడో..
మెచ్చుకున్న మా నోళ్లకు
నీ పనితనాన్ని ఈసడించుకుని
మూతి వంకర్లు పోవటమే తెలుసు...
నీకు పొట్టకోసినా అక్షరం ముక్క ఏమోగాని
నువు ఎదురుపడినప్పుడల్లా
మా ఆరోగ్య సూత్రంలా కనపడతావ్..
నీ కన్నీటి సుడుల లోపల
ఇంకెన్ని అగాధాలున్నా ఊరి శుభ్రం కోసం
పరితపిస్తావ్..
ప్రశంస కోసం చూడని యోగ్యుడవు...
ఇప్పటికి నీ అవసరం విలువ తెలిసొచ్చింది
లోకానికి...
నువ్విప్పుడు గర్భగుడిని వొదిలొచ్చిన కదిలే
దేవుళ్ళా అగుపడుతున్నావు..
పాకీ పనికూడా దైవంలాంటిదేనని
హారతి పడుతుంటే...
నాకో పక్క
కుట్రలు కొత్త అవతారమెత్తినట్టుగా ఉంది
దగా పడ్డ.. జాతి గొంతులోకి
కుల వృత్తి కాలకూట రసాయాన్ని
కూల్ డ్రింక్లో కలిపి
తాగిస్తున్నట్టుగానే ఉంది..
వాళ్ళ కాళ్ళు కడిగి..
నోట్ల దండలు గుచ్చినా కానీ..
ఆ కష్టానికి..మీ రుణమాఫీ పథకాలు
దీర్ఘకాలమైనా చెల్లవు..
వాళ్ళలా మురుగులో స్నానిస్తే తప్ప.......

**-నేలపూరి రత్నాజీ...**
చాగల్లు తూర్పుగోదావరి జిల్లా

## పరిశుభ్రతకు ప్రతిరూపాలు



తెల్లవారుజామున చీకటిని చెరిపేసి
నిద్రలో మునిగిన నగరానికి శ్వాస నింపే వేగులు!
చెత్తకుప్పలలోనూ వెలుగును వెతికి
మన కలల జీవనానికి దారి వేసే మహా సేవా దీప్తులు!.
దుర్వాసనల మధ్య చిరునవ్వులు చిందించి
మన రేపటి ఉదయాన్ని పరిమళించే పరమాత్మలు వారు!
వర్షం రానీ , మంచు కురవనీ,
వారి అడుగుల్లో మాత్రం ఆగని పోరాటం!
నిరంతరం సాగుతుంది ఆ ప్రయాణం!.
బస్తీ వీధుల నుంచి బంగారు నగరాల వరకు
శుభ్రతే మంత్రంగా మిగిలే పవిత్ర పాదయాత్ర!
చెమట బిందువుల్లో దాగి ఉన్న త్యాగమే
మన సమాజం దృఢంగా
నిలబడే గట్టి పునాది!.
ఎవ్వరూ చూడని చోట
మట్టితో పోరాడి
అందరూ చూసే అందాన్ని పండించే అమృతహస్తులు!
వారి పనికి జేజేలు పలకకపోయినా
కించిత్ బాధలేక విసుగులేకసాగే సూర్యులు!
ప్రతి ఉదయానికీ వారి శ్రమే మొదటి సూర్యకిరణం.
పండగలు పూలతో వెలిగే లోకంలో
ముందుగా వీధినీ పరిశుభ్రం
చేసే వీరులు వారే!
పసిడి పందిరిలా మెరిసే ఆ మార్గాల్లో
వారి సేవ ప్రతీ అడుగుకూ సుగంధమై నిలిచే ఋణం.
చీపురులో నిగూఢమైన దేవత్వమే
మనసుని నమస్కారంలా తాకి జ్ఞాపక మవుతుంది;
భూమిని శుభ్రపరచే ప్రతి కదలికలోనూ
మన జీవనానికి రక్షా కవచమై నిలిచే మహోన్నత రూపం.
కృతజ్ఞతల వెల్లువ గుండె నిండా ఉప్పొంగి
వారిని వందనం చేసే క్షణం వచ్చిందని అనిపిస్తుంది;
పరిశుభ్రతకు అంకితమైన ఈ మహానుభావులు
నిజంగా మన మధ్య నడిచే పరిశుభ్రతా దేవుళ్ళు.

**-రాజ్యలక్ష్మి శశిధర్**
విజయవాడ.

---

## గడించే వాడొకడు గుణించే వాడొకడు

కథ



ఒకప్పుడు రాజన్నపేట అనే చిన్న ఊరిలో గోపాలరావు, రామలక్ష్మి అనే దంపతులు నివసించేవారు. గోపాలరావు ప్రభుత్వ ఉద్యోగం చేసి పదవీ విరమణ పొందాడు. ఆయన పది ఎకరాల భూమి, రెండు ఇళ్లు, కొంత బంగారం, మరియు బ్యాంకులో లక్షల రూపాయల నగదు సంపాదించాడు.

అయినా, ఆయన తన భార్య సరదాలు, సంతోషాలు తీర్చేవాడు కాదు. ఆయన పరమ పిసినారి. వారికి పిల్లలు లేరు. బంధువులంటే కూడా ఆసక్తి లేదు. ఎప్పుడూ తన డబ్బు ఖర్చు కాకూడదని భావించేవాడు. ఆయన ఖరీదైన బట్టలు కట్టేవాడు కాదు. కడుపునిండా తిండి తినేవాడు కాదు. దానం, ధర్మం చేసేవాడు కాదు.

ఊరి వారంతా పిసినారి గోపాలరావును చూసి, "గడించే వాడొకడు, గుణించే వాడొకడు" అని వెనకే నవ్వుకునేవారు. అలా సంవత్సరాలు గడిచాయి. గోపాలరావు, అతని భార్య మరణించారు. వారికి పిల్లలు లేకపోవడంతో ఆ ఆస్తి దూరపు బంధువు అయిన రమేష్‌కు దక్కింది.

రమేష్ ఆ డబ్బుతో కొత్త కారు కొన్నాడు, బంగ్లా కట్టించాడు, బాగా తిని, తాగి, విలాసవంతంగా గడిపి గోపాలరావు కూడ బెట్టిన డబ్బుని హారతి కర్పూరంలా ఖర్చు చేశాడు.

ఊరి ప్రజలు, "గోపాలరావు జీవితాంతం గడించిన దానిని ఈ రమేష్ గుణిస్తున్నాడు! వీడి అదృష్టం బాగుంది" అనేవారు.

ఒకరోజు రమేష్‌కు గోపాలరావు రాసిన ఒక డైరీ కనిపించింది. దాని చివరి పేజీలో

"అవసాన దశలో ఆదుకుంటాయని, తిని తినక పైసా పైసా కష్టపడి కూడబెట్టాను. వృద్ధాప్యం వచ్చాక ఒంట్లో శక్తిలేక, తినే ఆసక్తి లేక ఖర్చు చేయలేకపోయాను. ఎటువంటి ఆనందాన్ని పొందలేకపోయాను. ఇప్పుడు డబ్బు సుఖం ఇవ్వలేదు. నా ఆస్తి ఎవరికి దక్కుతుందో నాకు తెలియదు. నిజమైన ఆనం దం దాచడంలో కాదు, సరియైన సమయంలో ఖర్చుచేసి సుఖంగా, సంతోషంగా జీవించడం లోనూ, మరియు ఇతరులకు దానం చేయ డంలోనూ ఉంది. ఈ సత్యాన్ని నేను తెలుసు కునేసరికి సమయం మించిపోయింది." అని రాసి ఉంది.

అది చదివి చలించిపోయాడు రమేష్.

సంపాదన కంటే సద్వినియోగం గురించి ఆలోచించాలని అనుకున్నాడు. జీవితంలో కష్టపడేది మనమే అయినా, దాని ఫలితం ఎప్పుడూ మన చేతిలో ఉండదన్న విషయాన్ని గ్రహించాడు. డబ్బు దాచడం కంటే దానిని మంచి పనిలో వినియోగించడమే గొప్పదని తెలుసుకున్నాడు.

ఆ రోజు నుండి అతడు ఆస్తిలో కొంత భాగాన్ని దానధర్మాలు చేస్తూ, "ఇదే గోపాలరావు ఆత్మకు శాంతి కలిగించే మార్గం" అని అనుకున్నాడు. అలా అనాటి నుంచి 'గడించే వాడొకడు, గుణించే వాడొకడు' అనే సామెత వాడుకలోకి వచ్చింది.



**-కాశీ విశ్వనాథం పట్రాయుడు**
9494524445.

---

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1631వ రోజు 'పెదవి దాటిన మాట' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. **'పెదవి దాటిన మాట'** అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. -సంపాదకులు



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం**
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839

## పెను తుఫానే?

పెదవి దాటిన మాట
పెను తుఫాను సృష్టించవచ్చు
కలెక్టర్ జానకిలో కల్పించబడ్డ
కల్లబొల్లి కథా కమామిషులా.
మంచి మాటైతే నిర్భయం
అట ... అట.... అనేవే
కొంపలు ముంచుతాయి
కొట్లాటలు పెట్టిస్తాయి.
నిజం నీళ్లు తాగేలోపల
అబద్ధం ఊరంతా చుట్టి వస్తుంది
మంచిమాటలు మందగించి
తాబేలు నడక నడిస్తే
అబద్ధం మాత్రం కుందేలులా
పరుగెత్తి పందెం కోడిలా దూకి
మనస్పర్థలకు వేస్తుంది మారాకు.
మగువనోట
మాటల తూటాలు పేలితే
మరుభూమిలే మిగులొచ్చు
సముద్రాన సునామీలా
అతలాకుతలమే జీవితం.
అందుకే ఆచితూచి మాట్లాడాలి
చెవులు రెండు
మెండుగా వినడానికి
నోరు ఒక్కటే
మితంగా మాట్లాడడానికి.

**-నగునూరి రాజన్న**

## తుపాకీ పేల్చిన తూటా

పెదవి దాటిన మాట
తుపాకీ పేల్చిన తూటా.
తూటా గురి తప్పవచ్చు
దూరం,కాలం ఎక్కువైతే
నిస్సత్తువై నిర్జీవమై మిగులు.
మాటని గురి తప్పనీయరు
నోళ్ళుమారుతూ
ఎంత దూరమైనా
ఎంత కాలమైనా
ఆ మాటకి
చిలవలు పలవలతో
మరెంతో దూరం
కాలంతో
వ్యథలకు కారణం కావచ్చు.
పలికిన వ్యక్తి గతించవచ్చు
పలికిన మాట ఏ రూపంలోనైనా
సతాయించవచ్చు,
వాగ్దానాలు కాని
విమర్శ, దూషణాలు కావచ్చు
తిరిగి పలుమార్లు
నీ పైనే దండెత్తవచ్చు.
మంచి మాటలు
హితకర
సహాయ సలహాల మాటలు
చిరకాలం నిలవకపోవచ్చు
ఋణాత్మక ప్రేలాపనలు
అపాయకరం
తిరిగి పుచ్చుకోలేనివి.
రాజకీయనాయకుల మాటలు
ఇంటి పెద్దలు
వియ్యం అందుకున్నవారి మాటలు
పెదవి జారినంతనే
కయ్యాలకు
వైర జ్వాలలకు దారి
తస్మాత్ జాగ్రత్త!
మాటలను పెదవి వదిలేటప్పుడు
నాలిక ఏదేదో మాట్లాడి
పెదవుల వెనుక దాక్కుంటుంది,
పాపం వీపూ బుర్రలే
దెబ్బల పాలు..

**-రాజప్ప**

## బహిర్గతం

మాట పెదవి దాటితే
అది అందరికీ బహిర్గతం
పెదవి దాటక పోతే
అది రహస్యం
ఒక్కరికి చెప్పినా
ఒకరినుండి మరొకరికి
వారినుండి మరొకరికి
గాలి కన్నా వేగంగా వ్యాపించి
మనసును గాయం చేసి
చేస్తుంది అవమానాలపాలు
అవమానంతో ఆత్మహత్య.
సంబంధ బాంధవ్యాలకు విఘాతం
స్నేహం దూరమై భేదాభిప్రాయాలు
భార్యాభర్తల మధ్య అపార్థాలు
ఎన్నో అనర్థాలకు దారి
మాట పెదవి దాటితే ప్రమాదమే.

**-డా. షహనాజ్ బతుల్**

## బాబోయ్!

పెదవి దాటిన మాట!
బాబోయ్ ఆడవారి నోట!
అంటించని సీమ టపాకాయ
నిప్పులేక ఎగురు కప్పగంతులు
పెద్దల మాట ధిక్కరణ
దడదడ బడబడ వాగుడు
విశ్వమంతా బడబాగ్ని.
దారులు వెతుకుతూ
అడ్డదారులంట
దాటిన చిన్న మాట
జుట్టు జుట్టు పట్టుకు రచ్చరచ్చ.
మంధర శూర్పణఖ రేపారు చిచ్చు
ఊసుపోని అక్కసు కబుర్లు
కొంపలే ముంచు
రాజుగారి నెత్తిన
కొమ్ములన్న మాట
ఊరంతా మోగింది డప్పు.
కింగ్స్ న్యూ క్లోత్ లో
బుడతడి ప్రశ్న
"రాజు వంటిమీద దుస్తులేవి?"
బైటపడిన నేతగాళ్ల మోసం.
సమయసందర్భానుసారం
నమ్మకమున్న వారితో
కొరకాలి చెవి
ఇస్కో అంటే ఇస్కో జనాలతో
వస్తుంది ముప్పు
చేయకు ఆ తప్పు
మాటని గొంతులో
గుటుక్కుమనిపించి
గరళకంఠునిలా మారు
లేకుంటే
మన వేలితో
మన కన్నే పొడుస్తారు.

**-ఎ.రాజ్యశ్రీ**

## పేలిన బాంబు

మానవునికిచ్చిన దేవునివరం
మాట అని అందరి నమ్మకం
దాన్ని అతి జాగ్రత్తగా వాడి
బంగారు మాటగా చేసుకో.
మాట్లాడిన తర్వాత కాకుండా
మాట్లాడక ముందే ఆలోచించు
పెదవి దాటిన మాట
బాంబంత విస్ఫోటన కారకం.
నోరుతో పాటు ఆలోచించగల
శక్తిని కూడా దేవుడిచ్చాడు
మంచిచెడుతో
ఉచితానుచితాలనాలోచించు
పెదవి కదిపేందుకు.
మాట వెండి
మౌనం బంగారమని
తెలిసి మెలగు
పెదవిదగ్గరే ఆపగలిగితే
పృధ్వి దాటేందుకేదీ అవకాశం.
శ్రవణం గొప్ప కళా నైపుణ్యం
మాటలన్ని పనికిరావనీ
అవసరమని భావిస్తూ
మాట్లాడినది వివేకమేగా!.

**-ప్రశాంతి రేపూరి**

## పెన్నిధిగా

పెదవి దాటిన మాట
ఊరు విడిచిన బతుకు తెరువు
మనిషి నియంత్రణ లేని మానసం
స్వేచ్ఛా విహంగాలుగా విహారం
మాట
మనసును గాయం చేస్తే విషాదం
మనసుకు ఆహ్లాదమైతే ఆనందం
సాగే మాట
తూగుతుంది తూటాలా
సాగిన మాట
అభయ హస్తంలా మార్పు
మాట మలినమైతే మరో స్తరానికి
మాట ఆత్మీయమైతే
మనసుకో పులకింత
పెదవి దాటిన మాట
ప్రగతి పథం కావాలి
పెదవి దాటిన మాట
ప్రణయపు ఝరిగా
మనిషి జీవన వైశాల్యం పెంచాలి
మనిషి జీవితం
మహోన్నతమై ఎదగాలి
పేరు మంచిదైతే ఊరు మంచిదిగా
పెదవి దాటిన మాట
పెన్నిధిగా మారాలి
పెదవి దాటిన మాటతో
పెను ప్రమాదం
మాటను మమతలతో కొలువు
మకరందం చిందించు
మాట మంచిదైతే
ఊరంతా మంచిదే
మాట విరుపైతే జనవిరోధి.

**- లక్ష్మారెడ్డి పసుల**

## పృథ్వినే దాటు

సంస్కృతంలో
"శతం వద, ఏకం న లిఖ"
వంద మాట్లాడుగాని
ఒక్కటి రాయకు
ఎందుకంటే.
గాలిలో తేలుతుంది
దశ దిశల వ్యాపిస్తుందని.
అందుకే పెట్టారు ముడి
ఉసురుకూ ఊపిరికీ.
గాలి తిత్తిలోంచి వచ్చే గాలి
ఇనుమును మండించి కరిగిస్తుంది
ఈ ఉపయోగం అందరికీ తెలుసు
అదే మనిషి ఉసురు, బలం
వంశాలనే దహిస్తుందన్న
నిజం చెబుతోంది
అందుకే మాట జారకుండా చూడు
మహిని మమత పెంచు
భాష తక్కువగా వాడు
భాగ్యాన్ని పండించు
మితం మించకు
బతుకు నడక గతిని తప్పనీకు.
అవి శక్తులు
మాటకున్న బలం
విజ్ఞతతో ఆలోచించి
మసలుకోవాలి ప్రతి ఒక్కరూ
రీతిగా, నీతిగా, మితంగా మాట్లాడి
మనుగడ గతిని
సక్రమంగా పెంచుకోవాలి!!!.

**-కె.కె.తాయారు**

## పెదవి దాటిన పృథివి దాటు!

పెదవి దాటిన మాట కదిలి
ఒక చెవి నుండి
మరో చివర చేరి,
అంచె లంచెలుగా వ్యాప్తి చెంది
వాయు వేగంతో పరిగెత్తి
పృథివి అంచులు దాటి చేరు!.
పూర్తిగా ఒక మాట వినక
సగం సగం విని ఊరుకోక
చిలువలు,పలువలు అల్లి
పుట్టిస్తారెన్నో అవాస్తవాలు!
నమ్ముతారదే నిజమని అంతా!.
పుకార్లు అబద్ధమైతే
విడిపోతాయెన్నో జంటలు!
పెరుగుతాయి అపార్థాలు
ప్రేమికుల మధ్య!
వృద్ధులు
అనాదరణకు గురవుతారు!
ఆలుమగలు
అన్యోన్యం కూలిపోతుంది!.
ఆడ,మగ రోడ్డుమీద కనిపిస్తే
అంటగడతారు అక్రమ సంబంధం!
ఆరా తీస్తే వాళ్ళు అన్నా చెల్లెళ్ళే!
కార్యాలయ ఉద్యోగులు
కలిసి నడిస్తే
కల్పించి చెబుతారు ప్రేమ కథగా!
అప్పుల ఊబిలో మునిగినోడు
రుణదాతను అప్పడిగితే
లేనిపోని వన్నీ చెప్పి
శంకతో అప్పివ్వకుండా చేస్తారు!
జోరు వర్షంలో తలదాచుకో వస్తే
దొంగతనానికి వచ్చారని అంటారు!
అలా పోగొడతారు ఆశ్రయం!.
ఆచితూచి మాట్లాడడం నేర్చుకో!
పూర్తిగా వినకుండా, చూడకుండా
వదంతులు ప్రచారం అసలొద్దు!
అబద్ధ ప్రచారం ఏదో ఒకనాడు
తెస్తుంది నీకు తీరని అవమానం!!.

**-కోలా సత్యనారాయ**

## పెదవి దాటని మనసు

ఆవేశం హద్దులు మీరితే
పెదవి తలుపులు పగలగొట్టుకొని
మాటల తూటాలు పేలుస్తారు
దెబ్బ తగలకుండా
దద్దు తేలకుండా
కొడతారు మనసు మరణించేదాకా.
సమాజపు సంతలో
మనిషి యెట్లా ఉన్న కష్టమే
నిలబడ్డ చోటనే నిందలు
కనబడ్డ చోటనే కథల అల్లిక
కలం కాగితం లేకుండానే
పెదవులతో ఉత్తరం
మాటలతోనే చేరవేస్తారు.
నిజమెరుగకుండా
పెదవి మాట జారితే
పెను తుపాన్ సృష్టిస్తుంది
మనుషుల మధ్య
యుద్ధం మొదలౌతుంది
సమాజపు సంత
ఓ ప్రచార కేంద్రం.
గాలికన్నా వేగంగా
పొలిమేర దాటుతాయి
సాక్షాలు లేని ఆధారాలుగా
నిలబడతాయి
మాటలతో కొట్టిన దెబ్బ
మనసు మీద పడుతుంది
మరణించే వరకు
బతికే ఉంటుంది.
ఆచి తూచి మాట్లాడితే
మౌనం కూడా పదం అవుతుంది
మాట పెదవి దాటితే
బంధాలు బలపడుతాయి.
అవమానం హద్దులు మీరితే
పెదవి గోడలను
బద్దలు గొట్టుకొని
మాటల తూటాలు పేల్చి
ఎవరిని వారు కాపాడుకోవాలి
మన మాటలే మనకు అండ
ఆదరువు.
పెదవి దాటిన మాటకు
సీత అడవి పాలైంది
ఆ కథ రామాయణమైంది
చరిత్రకు సూచనగా మిగిలింది.
నోరు జారిన స్త్రీ మాటకు
మహాభారతం అయింది
మాట కత్తికన్నా పదును
ఒంటరి జీవితాలకు తోడు
ఈమాటే
మనిషి వ్యక్తిత్వాన్ని కాపాడేది
యుద్ధానికి సిద్ధం చేసేది
మంచికి మార్గం
వివాదాలకు తోవ
మాట పొదుపు
మనిషికి ఎదుగుదల
బతుకు ఎదుగుదల.

**-పొన్నాల ధనమ్మ**

## అదుపు-పొదుపు

మాట మనసుకి ఆహ్లాదం
పదుగురూ మెచ్చే నమ్మకం
రంగుల కలలకు రూపం
బంగరు భవితకు మదుపు
పొందికగా
వివేక విచక్షణలతో ఆలోచిస్తూ..
మంచీ చెడూ ఆలోచనలే నీ సొంతం
ఏ జీవికీ అందని సౌభాగ్యం
పదిలంగా పొదువుకో
అధరామృతం
అజరామర ప్రతిభకు
పట్టం కడుతుంది..
నలుగురిలో నిన్నొక్కడిగా
నిలబెట్టేది మాటే మంత్రం
సమైక్యతకు ఇంధనం
ఉద్యమ స్ఫూర్తికి తేజో విరాజితం
మార్పుకి నినాదం
జాతి అభ్యున్నతికి
దివ్య పథం.
పెదవి దాటిన మాటా
హద్దులు మీరిన ఆవేశం
సునామీని సృష్టించి
అనర్థాలకు కారణాలవుతాయి
అనుమానాలతో అవమానిస్తాయి
నీ ఉనికిని మార్చేసి
అధోగతికి దిగజారుస్తాయి.
అందుకే..మాటతోనే మంచితనం
స్నేహం ప్రేమ ఆత్మీయం లభ్యం
నోరు జార్చి మాట్లాడిన మాటలే
సమాజంలో
నిను ఒంటరిగా నిలబెడతాయి
అందుకే అంటారు
మాటే మనసుకు మంత్రమని.

**-పి.పద్మావతి**

# తెన్నేటి సుధ రచనలు సాహిత్యామృత ధార























హైదరాబాద్, నవంబర్ 26:ఆమె రచనలు ప్రవాహం లానూ లేక సముద్ర కెరటం లానూ ఉండవు. సున్నితంగా హాయిగా ప్రశాంతంగా వొక ధార సదృశ్యంగా ఉండి పాఠకులకు తగిన సమాచారం ఆలోచన కలిగిస్థాయి. ఆమె స్త్రీ వాద రచయిత్రిగా చెప్పుకోలేదు. అలాని సామ్యవాద రచయిత్రి గాను కారు. సంప్రదాయ రచయిత్రిగానూ గుర్తింపు పొందలేదు ఆవిడ. తెన్నేటి సుధాదేవి వస్తువుకు సందర్భానికి తగ్గట్టుగా వివిధ ప్రక్రియల్లో రచనలు చేసిన సుధా దేవి స్త్రీ సమస్యలు ప్రస్తావిస్తారు. సామాజిక రుగ్మతలు అసమానతలు పై ప్రశ్నిస్తారు. సంప్రదాయ కట్టుబాట్లు అవసరం నొక్కి చెబుతారు. తండ్రి టి. వి. సుబ్బారావు తల్లి అహల్యా దేవి అచ్చం తెలంగాణ ఆడబిడ్డ వరంగల్ జిల్లా. తండ్రి విద్యాన్ వి.ఎస్ తెన్నేటిగా ప్రసిద్ధులు. వృతి అధ్యాపనం ఐనా రచనా వ్యాసంగం ప్రవృత్తిగా జీవించారు. కాళోజీ నారాయణ రావు అనుయాయుడుగా తెలంగాణ సిద్ధాంత కర్త జయ శంకర్ తో పాటు పలువురు ప్రముఖులకు గురువుగా గుర్తింపు పొందారు. తండ్రి వారసత్వం పుణికి పుచ్చుకుని సుధాదేవి తెలుగు ఏం. ఏ. ఉస్మానియా యూనివర్సిటీలో చేసి బలిజేపల్లి లక్ష్మీ కాంత కవి నాటక కళా వైదుష్యం అంశంపై పరిశోధన చేసి తెలుగు విశ్వవిద్యాలయం నుండి పి.హెచ్.డి పట్టా పొందారు. తెలుగు అకాడమీలో ఉప సంచాలకులుగా పనిచేసిన సమయం లో తెలుగు అనే పరిశోధన పత్రిక కు సహ సంపాదకురాలుగా వ్యవహరించటం కాకుండా అకాడమీ ప్రచురించిన పలు గ్రంథాలుకు ప్రచురణ నిర్వహణ బాధ్యత చేపట్టారు. ఐదువందల తెలుగు సామెతలు నేపథ్యంగా ఐదు వందలు నాటికలు ఆకాశవాణి కోసం రాసి పలువురు ప్రశంస అందుకోవటం సుధా దేవి సృజన శక్తి కి ఉదాహరణ వినిపించనీ వేదన రవళి, అరవింద కథా సంపుటిలలో స్త్రీ సాధికారిత వివక్షత అంశాలు ప్రస్తావించారు. ఉదయ కాంత, అమ్మ కవితలో భావుకత సంప్రదాయము పై అభిమానం కనిపిస్తాయి. భర్త వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు ఆయనకి అచ్చమైన సహ ధర్మ చారిణగా వంశీ రామరాజు నడిపే అనాథ పిల్లల సేవా శ్రయలోనూ సాంస్కృతిక కార్యక్రమాలులోనూ ఆయనకు చేదోడు వాదోడుగా నిలిచారు.

వంశీ సంస్థ సాహిత్య కార్యక్రమంఐతే ప్రణాళిక అంత సుధాదేవిదే. గాయకులు, కళాకారులు, యువ కవులు సుధాదేవిని 'అమ్మ'అని సంభోధించారు. అంతటి ప్రేమతత్వం ఆమెది. ఆంధ్రా తెలంగాణ బంధం మా దాంపత్యం అనే వారు ఆమె. నల్ల కుంట వద్ద నున్న వారి ఇంట్లో సాహితీ సినీ రంగంలో మహా మహులు సుధాదేవి - రామ రాజు ఆతిథ్యం పొందినవారే. రాయప్రోలు సుబ్బారావు, దేవులపల్లి కృష్ణ శాస్త్రి, ఆరుద్ర, భానుమతి, జె.వి. సోమయాజులు, రాజేంద్ర ప్రసాద్, కె. విశ్వనాథ్, దాసరి నారా యణరావు, అక్కినేని, జమున, సుబ్బి రామిరెడ్డి ఇలా ఎందరో. ఆ చిన్న ఇంటిని మార్చి వేరే పెద్ద స్థలంలో ఇల్లు కొనుగోలు చేసే ఆలోచన రామరాజు చేయగా సుధాదేవి తిరస్కరించి రాయప్రోలు దేవులపల్లి, ఆరుద్ర నారాయణ రెడ్డి వంటి మహనీయులు తొక్కిన నేల అమ్మకూడదు అని వ్యతిరేకించారు. అక్కడే డెవలప్ చేసుకున్నాం అని రామరాజు పలు సందర్భాలలో చెబుతూ ఆమెకి తెలుగు సాహిత్యంపై వున్న అనురక్తి చెప్పేవారు. అదే ఇంట్లో సుధాదేవి ఆదివారం తన 73 ఏట తుది శ్వాస విడిచారు. ఎందరో సాహిత్య అభిమానులకు, రచయితలకు ఆమె మృతి ఆశని పాతం ఇందుకు ఆమె భౌతిక కాయం సందర్శించటానికి వచ్చిన సందోహం నిదర్శనం. మరణానికి కొన్ని రోజుల ముందు తెన్నేటి సుధ కథలు ప్రచురణ నిమిత్తం ఇచ్చి ఎదురు చూస్తున్నారు. ఇదే ఆమె సాహితీ పిపాస. సుధా దేవి ఉత్తమ రచయిత్రిగా తెలుగు దేశం పురస్కారం తెలుగు విశ్వవిద్యాలయం పురస్కారం, సుశీల నారాయణ రెడ్డి పురస్కారంతో పాటు పలు జాతీయ అంతర్జాతీయ సంస్థల అవార్డులను అందుకున్నారు. రాశిలో తక్కువ రచనలు చేసిన సుధా దేవి వాసి కలవిగా నిలిచి ఉంటాయి. ఎట్టి అర్భాటమ్, ఆరాటం లేకుండా ప్రశాంతంగా తన రచనా వ్యాసంగం కొనసాగించిన సుధా దేవి అలగే ప్రశాంతంగా నిష్క్రమించారు. -ఆర్.వి.రమణ























## రచయిత్రి సుధాదేవికి తుది వీడ్కోలు

హైదరాబాద్, నవంబర్ 26: ఆదివారం మృతి చెందిన ప్రఖ్యాత రచయిత్రి డాక్టర్ తెన్నేటి సుధాదేవి అంతిమ సంస్కారాలు అంబర్‌పే టలోని శ్మశాన వాటిక లో సోమవారం ముగిశాయి. పెద్ద ఎత్తున సాహితీవేత్తలు కళాభి మానులు ఆమె మృతదే హానికి నివాళి అర్పిం చారు. రాష్ట్ర శాసన సీబీఐ న్యాయస్థానం విశ్రాంత న్యాయ మూర్తి జస్టిస్ నాగ మా రుతి శర్మ, సంఖ్యా శాస్త్రవేత్త దైవజ్ఞ శర్మ, నటి రోజా రమణి, దూరదర్శన్ విశ్రాంత వ్యాఖ్యాతలు డాక్టర్ వోలేటి పార్వతీశం, విజ య దుర్గ, తెలుగు విశ్వ విద్యాల యం ఉపాధ్యక్షుడు ఆచార్య నిత్యానందరావు, నటుడు ప్రదీప్, నేటినిజం సంపాదకుడు బైస దేవదాసు, డాక్టర్ రామా కాంత రావు, హాంగ్‌కాంగ్ తెలుగు సంఘం అధ్యక్షుడు జయ, గాయ కులు చంద్రతేజ్, సురేఖ, అఖిల, గానసభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి, కిమ్స్ ఫౌండర్ బొల్లినేని కృష్ణయ్య, ఐలమ్మ మహిళా విశ్వ విద్యాలయం ఉపాధ్యక్షులు ఆచార్య సూర్య దనుంజయ, రచయిత్రి డాక్టర్ కె.వి. కృష్ణ కుమారి, రసమయి, డా॥ఎం.కె. రాము దంపతులు, డా॥ఎస్. రఘు, డా॥ సి. మృణాళిని, కిన్నెర రఘురాం, ఆచార్య టీ గౌరీశంకర్, రఘుశ్రీ, మౌనశ్రీ మల్లిక్, పెద్దూరి వెంకటదాసు, రాయప్రోలు వెంకటరమణ, మిత్ర, డా॥ సుద్దాల అశోక్‌తేజ పలువురు రచయిత్రులు కవులు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ శాసన సభ సభ్యులు మండలి బుద్ధప్రసాద్, నటుడు రాజేంద్రప్రసాద్, సబ్బ రాయుశర్మ జస్టిన్ రాధారాణి శాంత బయోటెక్ అధినేత డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి తదితర ప్రముఖులు వంశీ రామరాజును ఫోన్‌లో పరామర్శిం చారు. హర్యానా పూర్వ గవర్నర్ బండారు దత్తాత్రేయ తమ సంతాప ప్రకటనలో సాహిత్య సేవలో జీవితాన్ని అంకితం చేసిన సుధా దేవి మరణం బాధాకరం అన్నారు.



సమాజంలో ఆడ పిల్లలు కి విద్య సామాజిక సమన్వయం సంస్కృతికి విలువలు పరిరక్షణకి ఆమె రచనలు ద్వారా బలమైన సం దేశం అందించారని తాను ఇటీవల ఆమెతో కలసి వేదిక పంచుకున్న సందర్భం గుర్తు చేసుకుని వారి కుటుంబ సభ్యులకు విచారం తెలిపారు.









## గొప్ప ఇంజనీర్, రాజనీతిజ్ఞుడు మోక్షగుండం



సభలో ప్రసంగిస్తున్న మధుసూధనాచారి. వేదికపై బండి శ్రీనివాస్, గరిమెళ్ళ సీత, కళా జనార్ధనమూర్తి, శైలజామిత్ర

హైదరాబాద్, నవంబర్ 26: పేరెన్నికగన్న సివిల్ ఇంజనీర్, రాజనీతిజ్ఞుడు, వండితుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య అని కౌన్సిల్‌లో ప్రతిపక్ష నేత సిరికొండ మదుసూధనాచారి అన్నారు. త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో జరుగుతున్న ఎందరో మహానుభావులు శీర్షికన జరుగుతున్న కార్యక్రమాల పరిపరలో ఈనెల 20న భారతరత్న పురస్కార గ్రమిత మోక్ష గుండం విశ్వేశ్వరయ్య యాదిలో సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యఓతన జరిగింది. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ విశ్వేశ్వరయ్య చేసిన సేవలకు గుర్తింపుగా సెప్టెంబర్ 15న దేశవ్యాప్తంగా ఇంజనీర్స్‌డేగా జరుపుకుం టారని గుర్తు చేశారు. వరద నియంత్రణ, నీటి నిర్వహణ, ఆనకట్టల రూప కల్పనలో విశ్వేశ్వరయ్య ప్రతిభ ఎన్నదగిందన్నారు. కడక్ వాస్ల ప్రాజెక్టు, ఆటోమెటిక్ స్లాట్ గేట్ల రూపకల్పన ద్వారా ఆయన ఎంతో ప్రసిద్ధి చెందారన్నారు. హైదరాబాద్ నగరాన్ని వరదలనుంచి రక్షించడానికి మూసీనది, వరద నియంత్రణ ప్రణాళిక, ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల రూపకల్పనలో ప్రధాన కారకుడిగా పని చేశారన్నారు. క్రమశిక్షణ, కర్తవ్యనిష్ఠ, జాతీయాభివృద్ధి పట్ల అంకితభావం, కారణంగా ఆయునను ఆధునిక రుషిగా పిలుస్తారన్నారు. భారత ఇంజనీరింగ్ రంగానికి ఆయన చూపిన మార్గం ఇంజనీర్‌లకు నేటికీ కూడా స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రచయిత్రి శైలజామిత్ర, గాయని గరిమెళ్ళ సీత, గానసభ పాలకమండలి సభ్యులు బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ఎక్కడా ఆకలి దప్పులు ఉండవో...

ఎక్కడా బాధలు బరువులు లేని సమాజం ఉండదో
ఎక్కడా కరువు కాటకనీ కత్తి మొన అలలపై లేబర్ బలైపోడో
ఎక్కడా ఆకలి దాహానికి ఆహుతైపోరో
ఎక్కడా కుళ్ళు సమాజానికి ప్రశ్నయిపోడో
ఎక్కడా కన్నీరు కాలువలై పారదో
ఎక్కడా చెమట చుక్కలు సెలయేరులై పొంగి పోదో
ఎక్కడా నెత్తురు సంద్రమై పోటెదో
ఎక్కడా సమానతలు వేయి పడగలెత్తవో
ఎక్కడా పరువుప్రతీకారాహత్యలు ఉండవో
ఎక్కడా పూటకోరంగు మార్చే రాజకీయ ఊసరవిల్లు ఉండరో
ఎక్కడా కార్పొరేట్ల నిలువు దోపిడీ ఉండదో
ఎక్కడా అన్నదాత ఆకలి కేకలు ఉండవో
ఎక్కడా కులం పిశాచి కరాల నృత్యం చేయదో
ఎక్కడా పేదవాడు పల్లకిలో కూర్చుంటాడో
అక్కడా ఆ స్వేచ్ఛ స్వర్గంలోకి నా జాతిని నడిపించు స్వామి

-డి. రాములు
9391276057

## కవితార్చన



అడ్మిన్: డా॥రాధాకుసుమ
సెల్:99892 41319

"కుసుమ ధర్మన్న కళా పీఠం" సంస్థ ప్రతిరోజు కవిత్వ రచన చేయిస్తుంది.
అందులో ముఖ్యమైన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం..

-సంపాదకులు

### ఏదీ సులువుగా రాదు

మనిషికి మేధస్సు, మనసు ఇదే అన్నింటికి మూలం
అనేక మనో వికారాల నిలయాలు
అసూయ ద్వేషాలకు ఎవరు అతీతులు?
ప్రపంచం నేడు పరుగులమయం, తప్పదు పోటీ తత్వం
అన్ని రంగాలలో ఉన్నదన్నది నిజం
వెనుక బడితే తప్పదు పతనం
వెనుక నుంచి లాగే వారే అధికం
అవకాశాలు అవుతున్నాయి అత్యల్పం
ప్రతిభ కలిగిన వారికే లభిస్తుంది విజయం
కృషితోనే ప్రతిభ సాధించాలి
పోటీలో పాల్గొని సత్తా చాటాలి
రాజకీయమైన, వాణిజ్యమైన
ప్రభుత్వ కొలువులైన, ప్రయివేటు సంస్థలైన
క్రీడారంగమైన , చిరు వ్యాపారమైన
పోటీ లేని చోటు లేదు, ఏదీ సులువుగా రాదు
నిరంతరం కృషి చేస్తూనే ఉండాలి
ఆధునికతను ఆకళింపు చేసుకోవాలి
తన దైన శైలిలో ప్రతిభ చూపించాలి
అంచెలంచెలుగా ఎదిగి పోవాలి
ముందు చూపుతో ప్రతి అడుగు వేయాలి.

-షేక్ సలాం, 99639 30993

### చిరకాల బంధం

అక్షరాలను కూర్చి
పదాలను పేర్చి
కవితలుగా మార్చే
కవులున్న కుటుంబమే
ఈ సాహితీ కుటుంబం...
సన్మతితో మనం చేసే
అక్షర సేద్యం
సన్నుతిగా సరస్వతి దేవి
పాదాల చేరి
సద్వృతిని సమాజంలో
చేకూరుస్తుంది.
సాహితీ కుటుంబంతో సహవాసరి
చిరకాలం చిగురు లేసి
చివరూపిరివరకు తోడుండి
చిరంజీవిగా ఉండాలి.
సాహిత్య సోపతి విడవకుండా
సరాగాలు పలికించాలి
సరిగమలు పాడించాలి.
తేనె కన్నా తీయనైన తెలుగులో
మరంధాలను పంచే
మనసులతో
మమతలు పంచే బంధాలతో
సమాజాన్ని సన్మార్గంలో
ఉంచాలన్న తాపత్రయంతో
చిరకాలం సాగాలన్న తపనతో
సాగే ఈ ప్రయాణం
అనంతం...
ఆజన్మాంతం....

-వనం మంజు భార్గవి
9390685281

### చిత్రకవిత

నిండుజాబిలి అందరికీ
వెన్నెలలు కురిపిస్తే
నా జీవితానికి నిప్పులు
కురిపిస్తోంది
కడుపులో ఉన్న బిడ్డ
ఆడ,మగ తెలుసుకోవడానికి
నిన్ననే ఇంటిల్లిపాదీ
తరలి వచ్చారు. ఇంకేముంది
మళ్ళీ ఆడబిడ్డే అని తెలిసి
రాత్రంతా మంతనాలే
కడుపులోబిద్దని ఎలా
కాలరాయాలని
అందరిచూపుల్లో చెప్పలేని
ఏహ్యాభావం
ఇద్దరు ఆడబిడ్డల్ని
పెంచే అగత్యం మనకు లేదని
తెల్లారకుండానే
వదిలించుకోవాలని
భగవంతుడా
నాకేది దారి ,ఇంకా
భూమ్మీదకు రాని ప్రాణాన్ని
తుంచేస్తారా?
బిడ్డల్నిపొగొట్టుకోలేని అమ్మని
ధైర్యాన్ని కూడగట్టుకొని
ఓ బిడ్డనిచేతులతో చుట్టుకొని
కడుపులో ఉన్నబిడ్డకు
జాగ్రత్తలు చెబుతూ
వ డి వ డి గా అడుగులేస్తూ
జాబిల్లి వెంట రాగా
భవిష్యత్తు వైపు నడుస్తున్నా
నాకూ,నా ఇద్దరుబిడ్డలకు
సురక్షిత మైన ఆవాసం కోసం
ఆడపిల్లలు వద్దనే సంకుచిత
సమాజం నుండి
రేపటి ఉషోదయం వైపు
వ డి వ డి గా అడుగులు వేస్తున్న
ఆడపిల్లల్ని అపురూపం గా
చూసే నవ సమాజం వైపు.

-జంగా.కుసుమ కుమారి
91 99495 58088

### ప్రకృతి సోయగం

పొద్దు పొడి వెలుగుల్లో పచ్చని గాలి శ్వాసలో
పొలాల మీద పరుచుకున్న
బంగారు ధాన్య రాజ్యాలు
కొండల వెనుక నుంచి ఎగిసిన
ఉదయం సంగీతంలో
సీతాకోకిలలా చిలకరించిన చిన్ని రెక్కల పిట్టలు.
నీటి అంచున నిలబడి
నెమ్మదిగా నవ్విన సూర్యుడు
పాదాల దగ్గర పలికిన అలల పలకరింపు
గుసగుసలాడే గాలికి వాలి ఊగే
ధాన్యపు శిఖరం
ఆడి పాడే వాటి మధ్య చెలరేగిన పిట్టల మురిపం.
ఇంటి దూరాన నిలిచిన
రెండు చిన్న గుడిసెలలా
శాంతి ముద్దు పెట్టిన గ్రామపు జ్ఞాపకాలు
రెక్కల చప్పుడు పొలాల్లో పూలేసిన పాటల
ఈ చిత్రమే ప్రకృతి రాసిన ఒక జీవితం కవితలా..

-మోహన్ రెడ్డి
94925 62325

### మనసుతో ఒప్పంద పత్రం

ఆకసంలో మేఘాలని
మనిషి వేసుకున్న గ్రిల్స్
మధ్యనుండి చూస్తూన్నా..
పార్కింగ్ లో డి.జెల మధ్య
వినాయకుని నిమజ్జనోత్సవాలు.
మనిషివేసుకున్న రంగులు
వానకి తడచి జారిపోయిమట్టిలో కలవలేక
మదనపడుతున్నట్టనిపిస్తోంది.
పిడికెడంత గుండె ఉన్నమనిషి
ఇసుమంత మట్టికై వెతుకుతున్నాడు
తన చివరి దీపపు మజిలీకోసం
ఆకాశసౌధాల నైరాశ్యపు
పయనాలునాకొద్దు అని
ఆరోజే నామనసుతో
హామీపత్రం రాసుకున్నా
అవనిపై జానెడు స్థలంలో
పచ్చని చెట్లమధ్య
వర్షపు జల్లులు చూడాలని
మట్టిపరిమళాన్ని మనఃచేతల ఆస్వాదించాలని.
పల్లెకు పరుగెత్తుకొచ్చి పచ్చని చెట్ల నీడలలో
పదిలమైన సౌధంలో
నా మానససౌధం నిర్మించుకున్నా.

-నెల్లూరి ఇందిర
72859 45916

